http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 24 జూన్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5    వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

*మెట్రో మొదటిదశ ప్రాజెక్టును ప్రభుత్వం ఎల్అండ్టీ నుంచి గత ఏప్రిల్ 29న టేకోవర్ చేసిన సంగతి తెలిసిందే. గత సెపట?టంబర్లో మెట్రో మొదటి దశ ప్రాజెక్టు నుంచి తప్పుకోనున్నట్లు ఎల్అండ్టీ ప్రకటించినప్పటి నుంచి దశలవారీగా అనేక పరిణామాలు జరిగాయి. మూడు కారిడార్లలోని 69 కి.మీ. మెట్రో మొదటి దశ ప్రాజెక్టుపై అంచనాలను రూపొందించేందుకు అప్పట్లో ఐడీబీఐ సంస్థను నియమించారు. అలాగే సాంకేతిక అంశాలపై అంచనాల బాధ్యతలను ఢిల్లీ మెట్రోరైల్కు అప్పగించారు. ఈ రెండు సంస్థలు అందజేసిన నివేదికల ఆధారంగానే ప్రభుత్వం ముందుకెళ్లింది.*

# మెట్రో మళ్లీ మొదటికి..



- మెట్రో తొలిదశ స్వాదీనం, రెండో దశ విస్తరణపై మరోసారి అధ్యయనానికి కేంద్రం నిర్ణయం
- ఎస్బీఐ క్యాప్స్ సంస్థతో అధ్యయనం
- ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ
- ఐడీబీఐ నివేదిక అటకెక్కినట్టేనా?
- గందరగోళంగా మారిన స్వాదీన ప్రక్రియ
- రెండో దశ నిర్మాణ డీపీఆర్లో అనివార్యమైన మార్పులు

హైదరాబాద్

మెట్రో రైలు మొదటిదశ స్వాదీన ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. రెండు నెలల క్రితమే ఎల్అండ్టీ నుంచి ఈ ప్రాజెక్టును ప్రభుత్వం స్వాదీనం చేసుకుంది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్సీ) నుంచి రుణాలు బదిలీ కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మెట్రో స్వాధీనం, విస్తరణపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్రెడ్డితో కలిసి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్లాల్ ఖట్టర్తో సంప్రదింపులు జరిపారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్– ఐ వాల్యుయే షన్తోపాటు స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్––2 విస్తరణ, నిర్మాణ వ్యయం తదితర అంశాలను అధ్యయనం చేసేందుకు ఎస్బీఐ క్యాపిటల్ను కన్సల్టెన్సీగా నియమించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఎస్బీఐ క్యాప్స్ అందజేసే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని పేర్కొనడంతో టేకోవర్ ప్రక్రియలో - మిగతా3లో



# మెట్రో పేరుతో డ్రామాలు

- సీఎం రేవంత్రెడ్డి, కిషన్రెడ్డిపై కేటీఆర్ ధ్వజం
- సంస్థకు ఉన్నరూ. 30 వేల కోట్ల మెట్రో ఆస్తులపై సీఎం కన్ను
- ప్రతి మహిళకు రేవంత్ రూ. లక్షన్నర ఇస్తే రాజకీయాలు వీడుతానని వ్యాఖ్య

గచ్చిబౌలి/మియాపూర్

సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్రెడ్డి హైదరాబాద్ మెట్రో విషయంలో డ్రామాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆరోపించారు. కేంద్రాన్ని రేవంత్రెడ్డి ఏదో అడిగినట్లు, కిషన్రెడ్డి ఏదో తీసుకొస్తున్నట్లుగా ఢిల్లీలో మళ్లీ నాటకాలు మొదలు పెట్టారని ఆయన విమర్శించారు. మంగళవారం హైదరాబాద్లోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన పార్టీ సభ్యత్వ, 'సర్'శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మెట్రోకు చెందిన - మిగతా3లో



## రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం

- రాజేంద్రప్రసాద్, మురళీమోహన్, రోహిత్కు అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి
- ప్రముఖ మలయాళ జర్నలిస్ట్ పి. నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.టి. థామస్కు పద్మవిభూషణ్
- క్రికెటర్ రోహిత్ శర్మ, సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ , మాధవన్కు పద్మశ్రీ అవార్డులు

## ఉగ్రవాదం, సైబర్ ముప్పులపై ఉక్కుపాదం

- బ్రిక్స్ దేశాలకు ప్రధాని మోదీ కీలక సందేశం
- బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారులతో సమావేశమైన ప్రధాని మోదీ
- ఉగ్రవాదం, సైబర్ భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలని వ్యాఖ్యలు
- 2026లో బ్రిక్స్ కూటమికి భారతదేశం అధ్యక్షత వహిస్తోంది
- గతంలో 2012, 2016, 2021 లలో కూడా అధ్యక్షత వహించగా ఇది నాలుగోసారి.





## ఫీజుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

- ఫీజు రియంబర్స్మెంట్ స్కీమును పాత పద్ధతిలోనే అమలు చేయాలి
- కౌన్సిలింగ్ సమయంలో విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలి
- డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను కోరిన జాజుల శ్రీనివాస్ గౌడ్
- ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత
- త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటాం: భట్టి



## సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు

- సింధూ జలాల వివాదంపై పాక్కు భారత్ గట్టి కౌంటర్
- పీఓకేలో ఆందోళనల వెనక భారత్ హస్తం ఉందన్న వ్యాఖ్యలను తోసిపుచ్చిన భారత్
- పాక్ అనుసరిస్తున్న విధానాలే పీఓకేలో ఆందోళనలకు కారణమని వ్యాఖ్య
- దోపిడీ, అణచివేతకు పాల్పడటం వల్లే ప్రజలు రోడ్లపైకి వస్తున్నారన్న రణధీర్ జైస్వాల్

# వడ్డీ పద్దే పెద్దది

- రెండు నెలల రాబడిలో 12 శాతం పాత అప్పుల వడ్డీలకే సరి
- ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వ ఖజానాకు రూ.39 వేల కోట్ల ఆదాయం
- మొత్తం ఆదాయంలో 60% వడ్డీలు, సబ్సిడీలు, వేతనాలు, పింఛన్లకే..
- ఈ రెండు నెలల్లో మొత్తం నిధుల వ్యయాన్ని పరిశీలిస్తే వచ్చిన రాబడుల్లో 60 శాతం నాలుగు పద్దుల కిందే ఖర్చు



హైదరాబాద్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన తర్వాత రెండు నెలల కాలంలో రాష్ట్ర ఖజానా నుంచి ఎక్కువ భాగం నిధులు అప్పులకు వడ్డీలు చెల్లించడానికే ఖర్చయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. గత ఏప్రిల్, మే..రెండు నెలల కాలంలో మొత్తం రూ.39 వేల కోట్లకు పైగా నిధులు ఖజానాకు సమకూరగా, అందులో 12 శాతం అంటే రూ.4,658 కోట్లు వడ్డీల కింద చెల్లించినట్లు వెల్లడిస్తున్నాయి. ఈ రెండు నెలల్లో మొత్తం నిధుల వ్యయాన్ని పరిశీలిస్తే వచ్చిన రాబడుల్లో 60 శాతం నాలుగు పద్దుల కిందే ఖర్చయ్యాయని, వడ్డీల చెల్లింపులతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు, సబ్సిడీల రూపంలో రూ.23 వేల కోట్లకు పైగా ఖర్చయ్యాయని కంరప్టోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్, మే మాసాల్లో రెవెన్యూ రాబడుల కింద రూ. 28,441 కోట్లు ఖజానాకు సమకూరాయి. ఇందులో పన్ను ఆదాయం 26,093 కోట్లు - మిగతా3లో

# ఉగ్రవాదం, సైబర్ ముప్పులపై ఉక్కుపాదం



బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారులు సీనియర్ భద్రతా అధికారులతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రోజు సమావేశమయ్యారు. మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో ఉగ్రవాదం, సైబర్ భద్రత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో ఏర్పడుతున్న సవాళ్లను ఎదుర్కోవడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. సమావేశం అనంతరం సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో స్పందించిన మోదీ– బ్రిక్స్ దేశాల మధ్య భద్రతా సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. టెర్రరిజం సహా సైబర్ దాడులు, ఇతర అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొనేందుకు సభ్య దేశాలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. న్యూ ఢిల్లీ వేదికగా భారత జాతీయ భద్రతా సలహాదారు (చీూూ) అజిత్ డోభాల్ అధ్యక్షతన జరిగిన '16వ బ్రిక్స్ ఎన్ఎస్ఏ సమావేశం' విజయవంతమైంది. ఈ సదస్సుకు హాజరైన బ్రిక్స్ సభ్యదేశాల ఎన్ఎస్ఏలు, ఉన్నత స్థాయి భద్రతా అధికారుల బృందం ఆ తర్వాత మోదీతో సమావేశమైంది. ఈ సందర్భంగానే పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. 2026లో బ్రిక్స్ కూటమికి భారతదేశం అధ్యక్షత వహిస్తోంది. గతంలో 2012, 2016, 2021 లలో కూడా అధ్యక్షత వహించగా ఇది నాలుగోసారి. ఇక ఈసారి రెసిలెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్, సస్టైనబులిటీ (స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత) అనే థీమ్‌తో భారత్ ముందుకు సాగుతోంది. అంటే ఈ ఇతివృత్తం ద్వారా సహకారం, ఆవిష్కరణలు, స్థిరత్వం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ సంవత్సరం భారత నాయకత్వంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, గ్లోబల్ సౌత్ దేశాల ప్రాధాన్యతలకు పూర్తి మద్దతు ఇవ్వడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయని మోదీ చెప్పారు. మరింత సురక్షితమైన, సమగ్రమైన ప్రపంచ నిర్మాణానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని స్పష్టం చేశారు. ఇక దిల్లీలో జరిగిన సమావేశానికి బ్రెజిల్, చైనా, రష్యా, సౌతాఫ్రికా, ఈజిప్ట్, యూఏఈ, ఇరాన్, ఇండోనేసియా, ఇథియోపియా, సౌదీ అరేబియా తదితర దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. బ్రిక్స్ చీూూ సదస్సుకు నేతృత్వం వహించిన భారత ఎన్ఎస్ఏ అజితే డోభాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ అనేది ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైన, ప్రత్యేకమైన కూటమి అని అభివర్ణించారు. ప్రస్తుతం ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన వేదికగా ఎదిగిందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలు ప్రపంచ రాజకీయ, ఆర్థిక, భద్రతా వ్యవస్థల్లో మరింత కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకున్నాయని వ్యాఖ్యానించారు.

**11 సభ్యదేశాల ప్రతినిధులు హాజరు**

ఈ బ్రిక్స్ ఉన్నత స్థాయి సదస్సులో బ్రిక్స్ కూటమిలోని 11 ప్రధాన సభ్యదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, దక్షిణాఫ్రికా మంత్రి ఖుంబుజో, యూఏఈ జాతీయ భద్రతా మండలి ప్రధాన కార్యదర్శి అలీ మొహ్మద్ అల్ షంసీ, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగూతో పాటు ఈజిప్ట్, ఇథియోపియా, బ్రెజిల్, ఇరాన్, ఇండోనేసియా దేశాలకు చెందిన అత్యున్నత రక్షణ, భద్రతా అధికారులు హాజరయ్యారు. సమావేశంలో సరిహద్దు భద్రత, ఆహార ఇంధన భద్రత, వాతావరణ మార్పులపై సుదీర్ఘంగా చర్చించారు.

**బ్రిక్స్ కూటమి దేశాలివే**

బ్రిక్స్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న 4 ప్రధాన దేశాల కూటమిగా మొదలైంది. ముందుగా బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాతో దీ=×జ గా ఏర్పడగా తర్వాత సౌతాఫ్రికా చేరడంతో దీ=×జూ గా మారింది. ఇటీవలి కాలంలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఇండోనేసియా వంటి కొత్త దేశాలు ఈ కూటమిలో అధికారికంగా చేరాయి. దీంతో ప్రస్తుతం మొత్తం 11 సభ్య దేశాలుగా ఉన్నాయి. థాయిలాండ్, వియత్నాం, మలేసియా సహా మరికొన్ని దేశాలు భాగస్వామ్య దేశాల హోదాలో చేరాయి.

# రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం



రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో అసాధారణ, విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. సాహిత్యం, విద్యా రంగానికి చేసిన విశేష సేవలకు గాను ప్రముఖ మలయాళ జర్నలిస్ట్ పి. నారాయణన్‌కు 'పద్మవిభూషణ్'ను ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.టి. థామస్ పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు.

**శిబు సోరెన్‌కు పద్మభూషణ్ అవార్డు**

ప్రవాస భారతీయుడు, ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ దత్తాత్రేయుడు నోరి పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. ఝార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకుడు, దివంగత నేత శిబు సోరెన్‌కు ప్రకటించిన పద్మభూషణ్ అవార్డును ఆయన సతీమణి రూపీ సోరెన్ రాష్ట్రపతి నుంచి అందుకున్నారు. కళారంగానికి చేసిన సేవలకు గాను ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి, బాలీవుడ్ నేపథ్య గాయని అల్కా యాగ్నిక్‌లు పద్మభూషణ్ అందుకున్నారు. అలాగే, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. సినీనటుడు =. మాధవన్ పద్మశ్రీ అందుకున్నారు. వీరితోపాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు.

**రామారెడ్డి మామిడికి మరణానంతరం పద్మశ్రీ**

ఇక, శాస్త్రవేత్త చంద్రమౌళి గడ్డమనుగుకు రాష్ట్రపతి ముర్ము పద్మశ్రీ అవార్డు అందజేశారు. డెయిరీ విభాగంలో రామారెడ్డి మామిడికి మరణానంతరం పద్మశ్రీ ప్రకటించగా కుటుంబ సభ్యులు స్వీకరించారు. ప్రసార భారతి మాజీ సీఈఓ, 'డీప్ టెక్ ఫర్ భారత్ ఫౌండేషన్' సహ వ్యవస్థాపకులు శశి శేఖర్ వెంపటి 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు.

ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 5 పద్మవిభూషణ్‌లతో కలిపి మొత్తం 131 పద్మ అవార్డులను ప్రకటించింది. ఇందులో మే 25న జరిగిన తొలి విడత కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 65 మందికి పద్మ అవార్డులను ప్రదానం చేశారు. మిగిలిన వారికి ఇవాళ జరిగిన రెండో విడత అవార్డుల కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

**అవార్డు రావడంపై ఆనందం వ్యక్తం చేసిన పలువురు**

ఇదిలా ఉండగా, పద్మ అవార్డులు రావడంపై పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. లద్దాఖ్?లోని సుదూర ప్రాంతానికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోవా-రిగ్పా డైరెక్టర్ డాక్టర్ పద్మ గుర్మెట్‌కు పద్మశ్రీ అవార్డు వరించింది. హిమాలయ సాంప్రదాయ వైద్య విధానాన్ని పరిరక్షించడం, ప్రచారం చేయడంలో ఆయన చేసిన కృషికి గాను ఈ గౌరవం దక్కింది. అయితే, లద్దాఖ్? వంటి మారుమూల ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఈ అవార్డు దక్కడం తనకే కాకుండా మొత్తం సోవా-రిగ్పా సమాజానికి దక్కిన గొప్ప గౌరవమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

**320 పాఠశాలలు, కళాశాలల స్థాపన**

మరొక పద్మశ్రీ గ్రహీత, కర్ణాటక లింగాయత్ ఎడ్యుకేషన్? సొసైటీ చైర్మన్? డాక్టర్ ప్రభాకర్ బసప్రభు కోరే బెళగావి జిల్లాకు చెందినవారు. "గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలు లేని పిల్లల కోసం గత 42 ఏళ్లుగా సేవలందిస్తున్నా. దాదాపు 320 పాఠశాలలు, కళాశాలలను స్థాపించాం. మా విద్యాసంస్థల్లో సుమారు 1.48 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు" అని ప్రభాకర్? తెలిపారు. వీటితో పాటు ఇంకా ఎన్నో కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. అయితే, తాను సేవలను గుర్తించి అవార్డు ప్రధానం చేయడంతో ప్రభాకర్? ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, భారత ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

# సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు



పాకిస్థాన్ జల భద్రతకు ముప్పు వాటిల్లితే భారత్‌పై యుద్ధానికి దిగుతామని పాకిస్థాన్ రక్షణ మంత్రి చేసిన వ్యాఖ్యలకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. పాకిస్థాన్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడంతో పాటు మానవ హక్కుల ఉల్లంఘనల నుంచి అంతర్జాతీయ దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి ఆరోపణలు చేస్తోందని విమర్శించింది. అలాగే, పాక్ ఆక్రమిత కశ్మీర్?లో జరుగుతున్న ఆందోళనల వెనక భారత్ హస్తం ఉందన్న వ్యాఖ్యలను కూడా భారత్? తోసిపుచ్చింది. పాక్ అనుసరిస్తున్న విధానాలే పీఓకేలో ఆందోళనలకు కారణమని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా అక్కడి ప్రజలను ఆర్థికంగా పాకిస్థాన్ దోపిడీ చేయడంతో పాటు, పరిపాలనాపరమైన అణచివేతకు పాల్పడటం వల్లే ప్రజలు రోడ్లపైకి వస్తున్నారని జైస్వాల్? పేర్కొన్నారు. నిరసనలను అణచివేసేందుకు నిరాయుధులైన పౌరులపై ఆయుధాలను ప్రయోగించడం, తీవ్రమైన పోలీసు దౌర్జన్యాలకు పాల్పడటం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పాక్ రక్షణ మంత్రి ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలని, అంతర్గత వైఫల్యాల నుంచి దృష్టి మరల్చే ప్రయత్నమేనని రణధీర్ జైస్వాల్ కొట్టిపారేశారు. మరోవైపు, పాకిస్థాన్ ప్రభుత్వం అక్కడి ప్రజలపై అమానుష చర్యలకు పాల్పడుతోందని విదేశాంగ శాఖ ఆరోపించింది. నిత్యావసర వస్తువులు, ఔషధాల సరఫరాను అడ్డుకోవడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, నిరాయుధ పౌరులపై ప్రాణాంతక బలప్రయోగం చేయడం వంటి చర్యలను తీవ్రంగా విమర్శించింది. అయితే, ఈ చర్యల కారణంగా ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారని జైస్వాల్ ఆరోపించారు.

**భారత్‌పై పాక్ రక్షణ మంత్రి వ్యాఖ్యలు**

గత శనివారం పాకిస్థాన్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ జాతీయ భద్రతకు ముప్పు ఏర్పడిందని భావిస్తే, భారత్‌తో యుద్ధానికి వెనుకాడబోమని వ్యాఖ్యానించారు. భారత్ తమ నీటి వనరులను అడ్డుకునే చర్యలను వేగవంతం చేస్తోందని నిర్ధారణ అయితే సైనిక చర్యలను కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. చెనాబ్ నదిపై నీటి ప్రవాహాన్ని భారత్ నియంత్రిస్తోందని, అలాగే, నదీ ప్రవాహాలకు సంబంధించి ఎలాంటి సమాచారం పంచుకోవడం లేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా, పశ్చిమాసియా పరిస్థితుల గురించి కూడా రణధీర్ జైస్వాల్ మాట్లాడారు. "ఆంక్షలు, ఇతర ఇటీవలి పరిణామాల విషయానికి వస్తే, మేం పశ్చిమ ఆసియాకు సంబంధించిన అన్ని పరిణామాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఇంధన వనరుల విషయానికొస్తే, మా విధానం జాతీయ ప్రయోజనాలకే నిర్దేశించింది. 140 కోట్ల మంది ప్రజలకు సరసమైన ధరలకు ఇంధనం అందుబాటులో ఉండేలా చూడటమే మా బాధ్యత. ఇటీవల, అమెరికా, ఇరాన్? మధ్య అవగాహన ఒప్పందం కుదిరిన తర్వాత హర్మూజ్? జలసంధి గుండా నౌకల రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. ఇటీవలి కాలంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)తో కూడా సంబంధాలు బలపడ్డాయి. ఇందులో రక్షణ భాగస్వామ్యం కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఇటీవలి కాలంలో రక్షణ భాగస్వామ్యం మరింత బలోపేతం అయ్యింది" అని రణధీర్ పేర్కొన్నారు. ఇక, ఖతార్‌లోని రస్ లఫాన్ పారిశ్రామిక నగరంలోని గ్యాస్‌క్షేత్రంలో జరిగిన పేలుడు ఘటనలో 12 మంది భారతీయులు మృతి చెందడంపై? రణధీర్ జైస్వాల్ సంతాపం వ్యక్తం చేశారు. భారతీయులతో పాటు మిగతా దేశాలకు చెందినవారు కూడా చనిపోవడం విచారకరమన్నారు. అయితే, చనిపోయిన భారతీయులను గుర్తించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, అలాగే, వారి మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడానికి స్థానిక అధికారు లతో చర్చలు జరుపుతున్నామని? పేర్కొన్నారు. మృతుల కు టుంబాలతోనూ సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. అయితే, గాయపడ్డవారిలో ఎంతమంది భారతీయులు ఉన్నారనేది ఇంకా స్పష్టంగా తెలియదని ఆయన చెప్పారు.

## 'డైపర్ విరాళాల కార్యక్రమం' ప్రకటించిన సీజేపీ



నీట్– యూజీ పేపర్ లీక్ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వినూత్న కార్యక్రమం చేపట్టింది. ఇప్పటికే దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన సీజేపీ, మంగళవారం "డైపర్ విరాళాల కార్యక్రమం" ప్రకటించింది. మంగళవారం సాయంత్రం చేపట్టనున్న 'డైపర్ ఎ డే కీప్స్ లీక్స్ అవే' ప్రచారంలో పాల్గొనాలని తమ మద్దతుదారులకు విజ్ఞప్తి చేశారు. నిరసన స్థలానికి డైపర్లు తీసుకువచ్చి వాటిపై ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను రాయాలని కోరారు. "ఒక డైపర్ తీసుకురండి. దానిపై ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను రాయండి. అది విద్యాశాఖ మంత్రికి చేరేలా మేము చూసుకుంటాము." అని సీజేపీ పేర్కొంది. ఇదిలా ఉండగా, నిరసన ప్రాంతాన్ని కుదించేందుకు పోలీసులు ప్రయత్నించారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. పేపర్ లీకుల్లో పాల్గొన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోకుండా, విద్యార్థులను శిక్షిస్తున్నారని ఆరోపించారు. సోమవారం రాత్రి దిల్లీ పోలీసులు బారికేడ్లను తొలగించి, నిరసన స్థలాన్ని చిన్న ప్రాంతానికి కుదించేందుకు ప్రయత్నించారని అన్నారు. కాగా, ఈ ఆరోపణలపై దిల్లీ పోలీసుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. నీట్ వివాదంతో సహా పేపర్ లీకులు, పరీక్షా అవకతవకలపై జవాబుదారీతనం కోరుతూ సీజేపీ ఆందోళనలు చేపట్టింది. ఈ క్రమంలోనే విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు నిరసన కొనసాగుతుందని ఆ పార్టీ స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే శనివారం నుంచి దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తోంది. మంగళవారం నాటికి ఈ నిరసన నాలుగో రోజుకు చేరుకుంది. పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల స్మృతిగా నిరసన ప్రదేశంలో కొవ్వొత్తులు వెలిగించారు. ఈ నిరసనలో విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు జంతర్ మంతర్ వద్ద సీజేపీ చేపట్టిన ఆందోళనలో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. ఆధార్, పాన్ కార్డుల తనిఖీ విషయంలో పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు దిల్లీ పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. నిరసన స్థలానికి వచ్చేవారిని ఆధార్, పాన్ కార్డులను చూపించాలని అడ్డుకుంటున్నారని దీప్కే ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య హక్కులకు సంబంధించిన అంశమని, ప్రజలను అనవసరమైన వేధింపులకు గురిచేయకూడదని అన్నారు. గత మూడు రోజులుగా తాము ఎటువంటి ఇబ్బందులూ కలిగించకుండా శాంతియుతంగా కూర్చున్నామని గుర్తు చేశారు. నిరసనల్లో పాల్గొనేవారు నిరంతరం శాంతిభద్రతలను పాటిస్తూ పోలీసులకు సహకరిస్తున్నారని చెప్పారు. అయినా, బారికేడ్ల వద్ద ప్రజలను ఆపి గుర్తింపు పత్రాలను అడగడం ఆశ్చర్యకరమని తెలిపారు. నిరసన ప్రదేశానికి ప్రజలు తాగునీరు, ఆహారం తీసుకువస్తున్నారని దీప్కే గుర్తుచేశారు. అక్కడ ఎటువంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరగనప్పుడు, నీరు తెచ్చేవారిని ఆధార్, పాన్ కార్డులు ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు. "ప్రజలు కేవలం నీరు, ఆహారం, ఇతర నిత్యావసరాలను మాత్రమే తీసుకువస్తున్నారు. నీరు వస్తోంది, ఆహారం వస్తోంది. చివరకు 'రాజ్మా–చావల్' కూడా తీసుకువస్తున్నారు. మాదకద్రవ్యాలు లేదా చట్టవిరుద్ధమైన వస్తువులేమీ రవాణా చేయడం లేదు కదా. కాబట్టి, ప్రజలను వారి ఆధార్, పాన్ కార్డులు అడగాల్సిన అవసరం ఏముంది?" అని దీప్కే ప్రశ్నించారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ఎందుకు సేకరిస్తున్నారని దీప్కే ప్రశ్నించారు. ఆధార్ కార్డుతో వ్యక్తిగత వివరాలను తెలుసుకోవచ్చని, కాబట్టి ఇది వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశమన్నారు. జంతర్ మంతర్ అనేది దేశంలో ప్రజాస్వామ్యయుత నిరసనలకు వేదిక అని, అక్కడికి వెళ్లడానికి ఎటువంటి వీసా అవసరం లేదని అభిజిత్ దీప్కే అన్నారు. పౌరులకు తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే హక్కు ఉందని, దానిని గౌరవించాలని చెప్పారు.

## సైనికుల కోసం స్వదేశీ వీల్‌చైర్లు

దేశ రక్షణ కోసం సేవలందించిన సైనికుల పునరావాసానికి తోడ్పడే మరో కీలక కార్యక్రమానికి ఐఐటీ మద్రాస్ శ్రీకారం చుట్టింది. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన 'వైడీ వన్' (ణ ాఅవ) అల్ట్రా–లైట్ వెయిట్ వీల్‌చైర్లను దిల్లీలోని ఆర్మీ హాస్పిటల్ (రిసెర్చ్ అండ్ రిఫరల్)కు ఆదివారం అధికారికంగా అందజేసింది. ఈ కార్యక్రమం కింద మొత్తం 100 వీల్‌చైర్లను అందించనున్నారు. అందులో తొలి విడతగా 25 వీల్‌చైర్లు అందజేయగా, మిగిలిన 75 వీల్‌చైర్లను రానున్న నెలల్లో దశలవారీగా సరఫరా చేయనున్నట్లు ఐఐటీ మద్రాస్ వెల్లడించింది. ఈ వీల్‌చైర్లు సాధారణంగా ఆసుపత్రుల్లో ఉపయోగించే సంప్రదాయ వీల్‌చైర్లలా కాకుండా, వినియోగదారులు స్వయంగా నడిపించుకునేలా రూపొందించారు. దీంతో ఆ వ్యక్తులు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా కదిలే అవకాశం ఉంటుంది. 'వైడీ వన్' వీల్‌చైర్లను ఐఐటీ మద్రాస్‌లోని టీటీకే సెంటర్ ఫర్ రిహాబిలిటేషన్ రీసెర్చ్ అండ్ డివైస్ డెవలప్‌మెంట్ (ఆర్2డీ2) అభివృద్ధి చేసింది. ఐఐటీ మద్రాస్ ఇంక్యుబేషన్ సంస్థ అయిన థ్రైవ్ మొబిలిటీ ఈ వీల్‌చైర్ల తయారీ బాధ్యతలు చేపట్టింది. నాణ్యతలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ, దిగుమతి చేసుకునే వీల్‌చైర్లతో పోలిస్తే తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ఫిసర్వ్ సీఎస్ఆర్ నిధులతో ప్రత్యేక కార్యక్రమం**


ఐఐటీ మద్రాస్‌లో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా, థ్రైవ్ మొబిలిటీలో హెడ్ ఆఫ్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్స్‌గా పనిచేస్తున్న అడ్మిరల్ దీపక్ బన్సల్ (రిటైర్డ్) ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, సైనిక వ్యవస్థల మధ్య సమన్వయం పెంచి, అత్యవసరంగా అవసరమైన వారికి స్వదేశీ సహాయక సాంకేతికతలు అందేలా కృషి చేశారు. ప్రపంచవ్యాప్తంగా చెల్లింపులు, ఆర్థిక సాంకేతిక సేవలు అందిస్తున్న ఫిసర్వ్? సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఈ ప్రాజెక్టు అమలవుతోంది. స్వదేశీ పరిశోధన, సామాజిక బాధ్యత, సైనికుల పునరావాస అవసరాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన కార్యక్రమంగా దీనిని భావిస్తున్నారు.

**'పరిశోధన నుంచి ప్రజల అవసరాలకు'**

ఈ సందర్భంగా ఆర్మీ హాస్పిటల్ (ఆర్అండ్ఆర్) కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ అవినాశ్ దాస్ మాట్లాడుతూ, కదలిక అనేది వ్యక్తి గౌరవం, స్వాతంత్ర్యానికి మూలాధారమని అన్నారు. భారత్?లోనే రూపొందించిన ఈ వీల్?చైర్ల వల్ల కొంతమంది కుటుంబాలు స్వతంత్రంగా జీవించేందుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సహకారాన్ని తాము స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఐఐటీ మద్రాస్ అధ్యాపకులు, ఆర్2డీ2 కేంద్రానికి చెందిన ప్రొఫెసర్ మణీశ్ ఆనంద్ మాట్లాడుతూ, దేశీయ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి సహాయక పరికరాలను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. తమ పరిశోధన ప్రయోగశాలలకే పరిమితం కాకుండా దేశానికి సేవ చేసిన సైనికులకు ఉపయోగపడుతుండటం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఫిసర్వ్ సీఎస్ఆర్ మద్దతుతో ఈ కార్యక్రమాన్ని పెద్ద స్థాయిలో అమలు చేయగలుగుతున్నామని ఆయన తెలిపారు. ఫిసర్వ్ గ్లోబల్ సర్వీసెస్ అధ్యక్షుడు సచిన్ కులకర్ణి మాట్లాడుతూ, సమాజానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. భారత సాయుధ దళాల కోసం స్వదేశీ మొబిలిటీ పరిష్కారాలను అందించడంలో ఐఐటీ మద్రాస్‌తో భాగస్వామ్యం కావడం గర్వకారణమని పేర్కొన్నారు. థ్రైవ్ మొబిలిటీ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు జస్టిన్ జెసుదాస్ మాట్లాడుతూ, భారతీయ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఈ వీల్‌చైర్‌ను రూపొందించామని, ఇప్పుడు అది సాయుధ దళాల సిబ్బందికి చేరడం తమ ఉత్పత్తి లక్ష్యానికి గొప్ప గుర్తింపని చెప్పారు. ఐఐటీ మద్రాస్‌లోని టిటికె సెంటర్ ఫర్ రిహాబిలిటేషన్ రీసెర్చ్ అండ్ డివైస్ డెవలప్‌మెంట్ (ఆర్2డీ2) తక్కువ ధరలో ప్రపంచ స్థాయి సహాయక సాంకేతిక పరికరాల అభివృద్ధికి కృషి చేస్తోంది.

# ఫీజుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

హైదరాబాద్: గత నాలుగు సంవత్సరాలుగా 14 లక్షల మంది [illegible] చెల్లించాల్సిన ఎనిమిది వేల కోట్ల రూపాయల ఫీజుల బకాయిలను తక్షణమే చెల్లించాలని, [illegible] ఫీజుల రియంబర్స్మెంట్ స్కీములు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కోరారు. హైదరాబాద్ లోని మహాత్మ జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కతో జాజుల శ్రీనివాస్ గౌడ్ బేటి అయ్యారు ఈ సందర్భంగా బీసీ డిమాండ్లతో కూడుకున్న వినతి పత్రాన్ని డిప్యూటీ సీఎంకు జాజుల అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ తో మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో వేలాదిమంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని, ఫీజులు చెల్లించాలని ప్రైవేట్ కళాశాల యజమాన్యాలు వేధిస్తున్నాడంతో అనేక మంది విద్యార్థులు ఇప్పటికే ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన తెలిపారు, కాంట్రాక్టర్లకు బిల్లులను ఆపి పేద విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు అలాగే 2008 సంవత్సరంలో ప్రారంభమైన ఫీజుల రియంబర్స్మెంట్ స్కీమ్ ను ఏ విధంగా అమలు చేశారో ఇప్పుడు కూడా జీవో నెంబర్ 8, 9 లను రద్దుచేసి పాత పద్ధతిలోని ఫీజుల రియంబర్స్మెంట్ స్కీమ్ అమలు చేయాలని ఆయన కోరారు, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం పదివేల ర్యాంకు నిబంధనలు ఎత్తివేసి పూర్తి ఫీజులను ప్రభుత్వం భరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



**త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటాం: భట్టి**

ఫీజుల రియంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని, ఫీజుల బకాయిల చెల్లింపు పై రెండు మూడు రోజుల్లోనే బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సానుకూల నిర్ణయం తీసుకుంటామని జాజులకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క హామీ ఇచ్చారు

# బీజేపీ నేతలకు ఏమైంది



**హైదరాబాద్ :** ఒక్క విమర్శకు సరైన సమాధానం లభించడం లేదు. కనీసం ఆత్మరక్షణకు కూడా పాల్పడే అవకాశం కూడా కనిపించడం లేదు. అంత వీక్ అయిపోయారా.. గట్టిగా వాయిస్ కూడా వినిపించలేకపోతున్నారా.. ఇలా ఎందుకు ఉండిపోతున్నారు.. ఇలా ఎందుకు అయిపోతున్నారు.. ఇదిగో ఇలానే సాగుతోంది నంలో ఒక టాక్ బలంగా నడుస్తోంది. దక్షిణాదిన బీజేపీకి వ్యూహం లేదు హవా లేదని అంటున్నారు. 10 మందిలో ఆరు ఏడుగురు ఇదే చెప్తారు. కర్ణాటకలో తప్పితే బీజేపీ ఎక్కడ బలంగా లేదు. కర్నాటకలో వచ్చిన అధికారం నిలుపుకోవడం లేదు. తమిళనాడులో బీజేపీకి మొదటి నుంచి వ్యతిరేకత ఉంది. కానీ అన్నామలై వచ్చాక ఆ ముద్రను చెరిపేసి కొంత వరకూ సక్సెస్ అయ్యారు. చివరకు ఆయనే బీజేపీ నుంచి వెళ్లిపోవడంతో అక్కడా వ్యూహం బెడిసికొట్టింది..ఇక ఏపీలో సొంతంగా బలపడే వ్యూహమే అక్కడ లేదు. టీడీపీతో కలిసే పోటీచేస్తు గెలుస్తున్నారు. ప్రత్యేక హోదా విషయంలో బీజేపీ వ్యతిరేకత బలపడింది. రాజ్యసభ లో మద్దతు కోసం జగన్ ను చేరదీసి పొందారని జనంలో భావన ఉంది. బీజేపీ కి ఆంధ్రాలో బలం లేకపోగా వ్యూహం కూడా లేకపోయింది.కేరళలో బీజేపీ వ్యూహం సక్సెస్ అయ్యింది. రాజీవ్ చంద్రశేఖర్ లాంటి నాయకుడిని బీజేపీ ఎంపిక చేయడం కమలం పార్టీకి బలంగా మారింది. తెలంగాణలో ఏర్పడిన దాంట్లో కూడా బీజేపీకి వాటా ఉందని సుష్మ స్వరాజ్ చెప్పడం.. తెలంగాణ ప్రజలు ఆదరించడం జరిగింది. తెలంగాణలో దీనివల్ల ఒరిగిందేమీ లేదు. కేవలం మోదీ మీద అభిమానంతో పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు తెచ్చుకుంది. బండి సంజయ్ హయాంలోనే బీజేపీ తెలంగాణలో బలపడింది.. అనేక సీట్లు గెలిచింది కూడా. బండి సంజయ్ పాదయాత్ర ఆపించేసి బీజేపీ తప్పు చేసింది. అది కంటిన్యూ చేసి ఉంటే బీజేపీ బలపడేది. కానీ బండి సంజయ్ ను పక్కనపెట్టి తెలంగాణలో బీజేపీ మంచి అవకాశం కోల్పోయింది.బిజెపి నాయకుల గురించి తెలంగాణలో చర్చ.2024 ఎన్నికల్లో బిజెపితెలంగాణలో సత్తా చాటింది. ఏకంగా 8 స్థానాలు గెలుచుకుంది. ఈ స్థాయిలో స్థానాలు సాధించి.. రెండు సెంట్రల్ మినిస్టర్ పోస్టులు అందుకొని.. తిరుగులేని స్థితిలో ఉండాల్సిన కమలం పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ఇలా ఇబ్బంది పడుతూ ఉండడం ఆవేదన కలిగిస్తోంది.. ముఖ్యంగా ఇటీవల కాలంలో మెట్రో లోన్ కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేసిన ప్రశ్నలకు ఇంతవరకు కిషన్ రెడ్డి నుంచి సరైన స్థాయిలో సమాధానం లభించలేదు. మెట్రో కు సంబంధించి రుణం మంజూరు కాకపోవడానికి కిషన్ రెడ్డి నే కారణమని రేవంత్ ఆరోపిస్తున్నారు. ఇటీవల అనేక సందర్భాలలో రేవంత్ రెడ్డి కిషన్ రెడ్డి మీద విమర్శలు చేశారు. కిషన్ రెడ్డి ఏదో ఊకదంపుడు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి.. అలా మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు. అంతేతప్ప తెలంగాణ ముఖ్యమంత్రి విమర్శలకు గట్టిగా కౌంటర్ ఇవ్వలేకపోయారు. కిషన్ రెడ్డి మీద విమర్శలు వస్తే ఆయన మాత్రమే సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితి.. కనీసం మిగతా ఎంపీలు గాని.. ఇతర నాయకులు గాని కిషన్ రెడ్డికి అనుకూ లంగా మాట్లాడలేదు. రేవంత్ రెడ్డి తీరును విమర్శించలేదు. బిజెపి పార్టీ సోషల్ మీడియా కూడా అదే నిర్లక్ష్యంతో ఉంది. కనీసం వివరాలతో.. గణాంకాలతో కౌంటర్ ఇవ్వలేదు. బిజెపి నేతలు ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. 8 మంది ఎంపీలు ఉండి కనీసం.. గట్టిగా కౌంటర్ కూడా ఇవ్వలేరా అంటూ ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ బిజెపి నేతల వ్యవహార శైలి ఎవరికి వారు అన్నట్టుగానే ఉంది. గతంలో బండి సంజయ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్నప్పుడు పరిస్థితి ఇలా ఉండేది కాదు. ఆయనను మార్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పరిస్థితి దారుణంగా మారిపోయింది. నేతలు ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా ఆరోపణ వచ్చినప్పుడు లేదా విమర్శలు ఎదురైనప్పుడు సమిష్టిగా వాటికి కౌంటర్ ఇవ్వడం లేదు.. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో ప్రచారం చేయడంలో ఇక్కడి నాయకులు విఫలమయ్యారు అని చెప్పుకోవచ్చు.. అందువల్లే రేవంత్ రెడ్డి కిషన్ రెడ్డి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు.బండి సంజయ్ కొడుకు ఎపిసోడ్ లో కూడా బిజెపి నేతలు పెద్దగా స్పందించింది లేదు. పైగా కొంతమంది నాయకులు మీడియాకు లీకులు ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి. దీనికి తోడు రేవంత్ రెడ్డి పదే పదే కిషన్ రెడ్డిని ఉద్దేశించి భారత రాష్ట్ర సమితికి బినామీ లాగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నకు తెలివిగా సమాధానం చెప్పడంలో కిషన్ రెడ్డి విఫలమవుతున్నారు.. అందువల్లే తెలంగాణ రాష్ట్రంలో బిజెపి స్థాయి రోజురోజుకు పడిపోతుంది. ఈటెల రాజేందర్ పెద్దగా కనిపించడం లేదు. డీకే అరుణ సైలెంట్ గా ఉండిపోయారు. బండి సంజయ్ కేవలం కరీంనగర్ పార్లమెంటు స్థానానికి మాత్రమే పరిమితమయ్యారు.. కిషన్ రెడ్డి అప్పుడప్పుడు తన మీద విమర్శలు వచ్చినప్పుడు విలేకరుల సమావేశం పెడుతూ వెళ్ళిపోతున్నారు. ధర్మపురి అరవింద్.. రఘునందన్ రావు.. ఇలా ఎవరి బౌండరీలో వారు ఉన్నారు. అందువల్లే రేవంత్ రెడ్డి తెలంగాణలో బిజెపిని చెడుగుడు ఆడుకుంటున్నారు.

# అద్దె వద్దు... సొంతం ముద్దు

**హైదరాబాద్ :** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో గడిచిన కొన్ని నెలలుగా నివాస గృహాల అద్దెలు ఊహించని రీతిలో పెరిగిపోవడం సగటు ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కరోనా తర్వాతి పరిణామాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ పూర్తిగా ముగిసిపోవడం, గ్లోబల్ కంపెనీలన్నీ ఉద్యోగులను ఆఫీసులకు రప్పించడంతో పశ్చిమ హైదరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి, మణికొండ, కొండాపూర్, మాదాపూర్, తెల్లాపూర్ వంటి పరిసర ప్రాంతాల్లో ఫ్లాట్ల కొరత ఏర్పడింది. దీనిని ఆసరాగా చేసుకుని ఓనర్లు అద్దెలను భారీగా పెంచేశారు. సాధారణ 2 ఃఊఐ, 3 ఃఊఐ ఫ్లాట్ల అద్దెలు కూడా ఏకంగా నెలకు 40,000 నుండి 60,000 వరకు పలుకుతుండటంతో ఐటీ శ్రేణులు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నాయి.ప్రతి నెలా అంత భారీ మొత్తంలో అద్దెలు కట్టి యజమానుల జేబులు నింపే కంటే.. కొద్దిగా డౌన్ పేమెంట్ సర్దుబాటు చేసుకుని, ఆ మొత్తాన్ని బ్యాంకు ఈఎంఐ గా మార్చుకోవడమే ఉత్తమమనే ధోరణి ఐటీ ఉద్యోగుల్లో స్పష్టంగా పెరిగినట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. నెలకు 50,000 అద్దె



రూపంలో చెల్లిస్తే ఐదేళ్ల తర్వాత మన చేతిలో ఏమీ మిగలదు.. అదే మొత్తాన్ని హోమ్ లోన్ ఈఎంఐగా చెల్లిస్తే దీర్ఘకాలంలో ఒక సొంత ఆస్తి సమకూరుతుంది అనే ఆర్థిక స్పృహ కొత్త తరం టెక్కీల్లో బలంగా కనిపిస్తోంది.ఈ మారిన మైండ్ సెట్ కారణంగా ఐటీ కారిడార్ చుట్టుపక్కల శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సరికొత్త లొకేషన్లలో ఫ్లాట్ల విక్రయాలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. తెల్లాపూర్, అమీన్‌పూర్, పటాన్‌చెరు, కొల్లూరు , నార్సింగి, గండిపేట పరిసర ప్రాంతాల్లో బడ్జెట్ అపార్ట్‌మెంట్లతో పాటు లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు, సెమీ-గ్రేడెడ్ విల్లా ప్రాజెక్టుల వైపు ఐటీ నిపుణులు మొగ్గు చూపుతున్నారు. బ్యాంకులు కూడా ఐటీ ఉద్యోగుల జీతాల ప్రొఫైల్‌ను బట్టి సులభంగానే 80 నుండి 90 శాతం వరకు గృహ రుణాలు మంజూరు చేస్తుండటం ఈ కొనుగోళ్ల జోరుకు మరింత ఊపునిస్తోంది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో హైడ్రా యాక్షన్ తదితర పరిణామాల తర్వాత ప్రస్తుతం కేవలం క్లియర్ టైటిల్స్, రేరా అనుమతులు ఉన్న ప్రాజెక్టులకే డిమాండ్ ఉంటోంది. నివాస గృహాల విలువ ఏటా స్థిరంగా పెరుగుతుండటం, హైదరాబాద్ ఐటీ రంగ భవిష్యత్తుపై నమ్మకం ఉండటంతో.. అద్దె ఇళ్ల ఇబ్బందుల కంటే సొంత ఫ్లాట్ కొనుగోలు వైపే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే రాబోయే రెండు మూడు త్రైమాసికాల్లో నివాస ఇళ్ల అమ్మకాలు మరిన్ని సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## మెట్రో మళ్లీ 'మొదటి'కి..

-మొదటిపేజీ తరువాయి

భాగంగా ఇప్పటివరకు జరిగిన పరిణామాలు ప్రశ్నార్థకంగా మారాయి. ఫలితంగా మొదటి దశ టేకోవర్ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఎస్‌బీఐ క్యాప్స్ సంస్థ మెట్రో మొదటిదశపై అంచనాలను రూపొందిస్తూనే రెండోదశ నిర్మాణ వ్యయాన్ని కూడా అంచనా వేయనుంది. దీంతో రెండో దశ డీపీఆర్‌లో కూడా మార్పులు అనివార్యమయ్యాయి.

**ఐడీబీఐ నివేదిక సంగతేంటీ...**

మెట్రో మొదటిదశ ప్రాజెక్టును ప్రభుత్వం ఎల్‌అండ్‌టీ నుంచి గత ఏప్రిల్ 29న టేకోవర్ చేసిన సంగతి తెలిసిందే. గత సెపట?టంబర్‌లో మెట్రో మొదటి దశ ప్రాజెక్టు నుంచి తప్పుకోనున్నట్లు ఎల్‌అండ్‌టీ ప్రకటించినప్పటి నుంచి దశలవారీగా అనేక పరిణామాలు జరిగాయి. మూడు కారిడార్‌లలోని 69 కి.మీ. మెట్రో మొదటి దశ ప్రాజెక్టుపై అంచనాలను రూపొందించేందుకు అప్పట్లో ఐడీబీఐ సంస్థను నియమించారు. అలాగే సాంకేతిక అంశాలపై అంచనాల బాధ్యతలను ఢిల్లీ మెట్రోరైల్‌కు అప్పగించారు. ఈ రెండు సంస్థలు అందజేసిన నివేదికల ఆధారంగానే ప్రభుత్వం ముందుకెళ్లింది. రూ.1,461.47 కోట్ల ఎల్‌అండ్‌టీ ఈక్విటీని చెల్లించడంతోపాటు రూ.13,538.53 కోట్ల అప్పును రీఫైనాన్స్ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఐఆర్‌ఎఫ్‌సీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నెలాఖరునాటికి చెల్లింపులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా కూడా ఐడీబీఐ క్యాపిటల్ సంస్థ వ్యవహరిస్తుందని నిర్ణయించారు. కానీ ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రుణాలు అందకపోవడంతో జాప్యం నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సంప్రదింపులు జరిపారు. ఈ చర్చలు విజయవంతంగా ముగిసినట్లు సీఎం ప్రకటించారు. అయితే, ఐడీబీఐ స్థానంలో ప్రస్తుతం ఎస్‌బీఐ క్యాపిటల్‌ను కన్సల్టెన్సీగా నియమించడంతో టేకోవర్ ప్రక్రియ ముందుకెళ్తోందా, వెనకడుగు వేస్తోందా తెలియని అయోమయం నెలకొంది.

**ఇప్పటి వరకు ఇలా...**

రెండో దశ నిర్మాణానికి అనుమతులను ఇచ్చేందుకు మొదటి దశ ప్రాజెక్టును ఎలా నిర్వహిస్తారంటూ కేంద్రం పలు సందేహాలు వ్యక్తం చేసింది. ఈ క్రమంలో మొదటి దశ ప్రాజెక్టు నుంచి తప్పుకోనున్నట్లు ఎల్‌అండ్‌టీ సంస్థ గత సెపట?టంబర్‌లో ప్రకటించింది. రెండోదశకు ఆటంకంగా ఉన్న మొదటిదశను ఎల్‌అండ్‌టీ నుంచి స్వాధీనం చేసుకొనేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పలు దఫాలుగా జరిపిన చర్చలు, సంప్రదింపులు, ఐఆర్‌ఎఫ్‌సీతో కుదుర్చుకున్న ఒప్పందం అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 29న అధికారికంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐఆర్‌ఎఫ్‌సీ, ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (హైదరాబాద్)లిమిటెడ్, హెచ్‌ఎంఆర్‌ఎల్ సంస్థలు ఢిల్లీలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. రూ.13,600 కోట్ల రుణ సౌకర్యాన్ని నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ రీఫైనాన్సింగ్ వంటి రుణ అవసరాలకు వినియోగించాలని ఒప్పందం చేసుకున్నారు. మే ఆఖరుకల్లా రుణాల రీఫైనాన్సింగ్ పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటివరకూ ఈ ప్రక్రియ పట్టాలెక్కలేదు.

**మరోసారి అంచనాలు ఎందుకు?**

మెట్రో మొదటి దశ టేకోవర్‌పై మరోసారి అంచనాలను రూపొందించాలని నిర్ణయించడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటనేది చర్చనీయాంశంగా మారింది. రూ.30 వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును ప్రభుత్వం రూ.15వేల కోట్లకే టేకోర్ చేసినట్లు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ టేకోవర్ వల్ల మెట్రో ప్రాజెక్టు కోసం కేటాయించిన 269 ఎకరాల భూములు ప్రభుత్వపరం కానున్నాయి. అలాగే వివిధ ప్రాంతాల్లో నిర్మించిన మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లలో సుమారు 16 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులో ఉంది. మెట్రోకు కేటాయించిన ఆస్తులను లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని ఆర్జించేందుకు ఎల్‌అండ్‌టీకి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇప్పటివరకు ఎల్‌అండ్‌టీ సంస్థ కేవలం 4 లక్షల చదరపు అడుగులను మాత్రమే లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని ఆర్జించింది. రాయదుర్గం వద్ద ఉన్న కొంత భూమిని మాత్రం ఓ ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చింది. ఇటీవల హైదరాబాద్‌లో భూముల విలువ గణనీయంగా పెరిగిన దృష్ట్యా మెట్రో భూములను విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి భారీ మొత్తంలో ఆదాయం లభించే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే మెట్రో మొదటిదశ అంచనాలపై మరోసారి అధ్యయనం చేయాలని కేంద్రం కోరినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఎస్‌బీఐ క్యాపిటల్ సంస్థను కన్సల్టెన్సీగా నియమించినట్లు తెలుస్తోంది.

## వడ్డీ పద్దే పెద్దది

-మొదటిపేజీ తరువాయి

కాగా, పన్నేతర ఆదాయం కింద రూ.1,803 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.544.99 కోట్లు వచ్చాయి. మూలధన రాబడుల రూపంలో మరో రూ.10,603 కోట్లు రాగా, అందులో అప్పుల రూపంలోనే రూ.10,595 కోట్లు వచ్చాయి. రెవెన్యూ, మూలధన రాబడులు కలిపి రూ.39,045.24 కోట్లు వచ్చినట్టు కాగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక మొత్తం రాబడుల్లో రెవెన్యూ వ్యయం కింద రూ.33,479 కోట్లు, మూలధన వ్యయం రూపంలో రూ. 3,932.36 కోట్లు ఖర్చయ్యాయి. రెవెన్యూ వ్యయం కింద ఖర్చు చేసిన వాటిలో సబ్సిడీలకు రూ.5,809 కోట్లు, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పింఛన్ల కోసం రూ.13 వేల కోట్లు చెల్లించగా, రెవెన్యూ పద్దు కింద దాదాపు రూ.10 వేల కోట్లు ఖర్చయ్యాయి. మొత్తం మీద రెండు నెలల కాలంలో రూ. 37,412.33 కోట్లు ఖర్చు కాగా, మొత్తం వ్యయ గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై అనివార్య ఖర్చుల భారం పెరుగుతోందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పన్ను ఆదాయం విషయానికి వస్తే ప్రతి పద్దు కింద గత ఏడాది రెండు నెలల కాలంతో పోలిస్తే పన్నులు పెరగడం గమనార్హం.

## మెట్రో పేరుతో డ్రామాలు

-మొదటిపేజీ తరువాయి



రూ. 30 వేల కోట్ల విలువైన ఆస్తులపై సీఎం రేవంత్ కన్నేశారని.. అందుకే అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి రాష్ట్రం నుంచి తరిమేశారని ఆరోపించారు. 250 ఎకరాలను కుటుంబ సభ్యులకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎల్ అండ్ టీకి ఉన్న రూ. 14 వేల కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తామని చెప్పి మెట్రో రైళ్లను దివాలా తేయించే ప్రయత్నం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. కిషన్‌రెడ్డికి, కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే లక్డీకాపూల్ నుంచి పటాన్‌చెరు వరకు గతంలో తాము ప్రతిపాదించిన మెట్రో రైలు అలైన్‌మెంట్‌కు ఎందుకు అనుమతి ఇవ్వలేదని ప్రశ్నించారు. జనసాంద్రత ఉన్న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో రైలుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేస్తే రేవంత్‌రెడ్డి రద్దు చేశారని కేటీఆర్ మండిపడ్డారు.

**శేరిలింగంపల్లిని రూ. 9,500 కోట్లతో అభివృద్ధి చేశాం..**

శేరిలింగంపల్లిలో పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రూ. 9,500 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని కేటీఆర్ చెప్పారు. సినీహీరో రజనీకాంత్ శేరిలింగంపల్లి ప్రాంతాన్ని చూసి హైదరాబాద్‌లో ఉన్నానా లేక అమెరికాలో ఉన్నానా అనే సందేహం కలుగుతోందని అన్నారంటే ఏ స్థాయిలో అభివృద్ధి జరిగిందో అందరూ గుర్తుచేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ముందు వారిని లక్షాధికారులను చేయాలని సూచించారు. ఒక్కో మహిళకు రూ. లక్షన్నర ఇస్తే రాజకీయాలు వదిలేస్తానని సవాల్ విసిరారు.

**కార్యకర్తలే డ్రైవర్లు..**

'కారు'కు కార్యకర్తలే డ్రైవర్లని, పదవి ఇచ్చినా ఇవ్వకున్నా ప్రతి ఒక్కరూ కేసీఆర్ సారథ్యంలో పార్టీ కోసం అహోరి?నశలూ శ్రమిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కార్యకర్తలతో కరచాలనం చేస్తూ, సెల్ఫీలు దిగుతూ కేటీఆర్ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు వివేకానంద, నాయకులు రాగడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొమిరిశెట్టి సాయిబాబ, బొబ్జానవతా రెడ్డి, రోజా రంగారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక శక్తి.. 10 ఏళ్లలో ఏడుగురు ప్రధానులు

ఒకప్పుడు ప్రపంచాన్ని పాలించిన దేశం. పారిశ్రామిక విప్లవానికి పుట్టినిల్లు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువు. అలాంటి బ్రిటన్ (యూకే) నేడు తీవ్రమైన ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా పేరున్న యునైటెడ్ కింగ్‌డమ్ ప్రస్తుతం వృద్ధి మందగమనం, అధిక రుణభారం, జీవన వ్యయాల పెరుగుదల, ఆరోగ్య వ్యవస్థ ఒత్తిడి, వలసల సమస్యలు, ఉత్పాదకత తగ్గుదల వంటి అనేక సవాళ్లతో పోరాడుతోంది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానాన్ని కలిగి ఉన్న దేశం ఈ పరిస్థితికి ఎలా చేరుకుంది? ఈ ప్రశ్నకు సమాధానం గత కొన్ని దశాబ్దాల విధాన నిర్ణయాలు, రాజకీయ పరిణామాలు, ప్రపంచీకరణ ప్రభావాలు ఇంకా నిర్మాణాత్మక బలహీనతల్లో దాగి ఉంది.బ్రిటన్ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్న తీవ్ర అస్థిరత మరోసారి ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. బ్రిటన్ తాజా ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తన పూర్తి పదవీ కాలాన్ని పూర్తి చేయకుండానే అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో గత 10 ఏళ్ల వ్యవధిలోనే బ్రిటన్ ఏకంగా ఆరుగురు ప్రధాన మంత్రులను మార్చినట్లయింది. ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన ఒక అగ్రదేశంలో ఈ స్థాయి రాజకీయ సంక్షోభం తలెత్తడం ప్రజాస్వామ్య వ్యవస్థల స్థిరత్వంపై సరికొత్త చర్చకు దారితీస్తోంది.బ్రిటన్ రాజకీయాల చరిత్రను గమనిస్తే.. 2016 లో జరిగిన బ్రెక్సిట్ రెఫరెండం తర్వాత అక్కడ స్థిరమైన ప్రభుత్వం అనేది లేకుండా మారింది. నాటి ప్రధాని డేవిడ్ కామెరూన్ రాజీనామా తర్వాత తెరిసా మే, ఆపై బోరిస్ జాన్సన్, కేవలం 45 రోజులు మాత్రమే పదవిలో ఉన్న లిజ్ ట్రస్, ఆ తర్వాత భారత సంతతికి చెందిన రిషి సునక్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు పదవుల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఇటీవలే లేబర్ పార్టీని భారీ విజయంతో అధికారంలోకి తెచ్చిన కీర్ స్టార్మర్ సైతం దేశంలోని ఆర్థిక సవాళ్లు, అంతర్గత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఐదేళ్ల పూర్తి టర్మ్ ముగియకుండానే తప్పుకోవడంతో బ్రిటన్ పతనావస్థకు ఈ సంక్షోభం అద్దం పడుతోంది.సరిగ్గా ఇదే 10 ఏళ్ల కాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం సాధించిన రాజకీయ స్థిరత్వాన్ని ఇక్కడి పరిణామాలతో పోల్చి చూపిస్తున్నారు. లండన్ వీధుల్లో ప్రధానుల మార్పిడి ఒక ప్రహసనంగా మారిన తరుణంలో.. భారత్‌లో మాత్రం ఇదే దశాబ్ద కాలంలో కేవలం ఒకే ఒక్క ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో స్థిరమైన పరిపాలన సాగుతోంది. ఈ రాజకీయ స్థిరత్వమే అంతర్జాతీయంగా భారతదేశ ఆర్థిక వృద్ధికి, దౌత్యపరమైన విజయాలకు ప్రధాన ఇంధనంగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఒకవైపు బ్రిటన్ వంటి సంప్రదాయ ప్రజాస్వామ్య దేశాలు నాయకత్వ మార్పులతో, విధానపరమైన అస్థిరతతో కొట్టుమిట్టాడుతుంటే.. భారతదేశం వరుసగా మూడోసారి ఒకే నాయకత్వాన్ని ఎన్నుకుని స్థిరమైన విధానాలతో ముందుకు సాగుతోంది. కీర్ స్టార్మర్ రాజీనామాతో బ్రిటన్ తదుపరి ప్రధాని ఎవరనే ఉత్కంఠ నెలకొనగా.. గ్లోబల్ ఇన్వెస్టర్లు మాత్రం స్థిరత్వానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన భారత్ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.20వ శతాబ్దం మధ్య వరకు బ్రిటన్ తయారీ రంగంలో అగ్రగామిగా ఉండేది. అయితే కాలక్రమేణా భారీ పరిశ్రమలు క్షీణించాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఫైనాన్స్, బ్యాంకింగ్, సేవల రంగాలపై ఆధారపడిపోయింది.ప్రత్యేకించి లండన్ నగరం ప్రపంచ ఆర్థిక కేంద్రంగా ఎదిగింది. కానీ ఈ మార్పు దేశంలోని మిగతా ప్రాంతాలకు సమాన అభివృద్ధిని తీసుకురాలేకపోయింది. ఫలితంగా లండన్ అభివృద్ధి చెందుతుండగా, ఇతర ప్రాంతాలు వెనుకబడ్డాయి.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పరిస్థితులు మారడం ప్రారంభమయ్యాయి. అమెరికా ఆ తరువాత చైనా వంటి దేశాలు ఆర్థికంగా బలపడటంతో బ్రిటన్ తన ఆధిపత్యాన్ని క్రమంగా కోల్పోయింది. అయినప్పటికీ, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్ రంగం, విద్య, సాంకేతికత వంటి రంగాల ద్వారా ప్రపంచంలో ప్రాధాన్య స్థానాన్ని కొనసాగించింది.బ్రిటన్ ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం ఉత్పాదక రంగం బలహీనపడటం. గత మూడు దశాబ్దాలుగా తయారీ పరిశ్రమల ప్రాధాన్యం తగ్గిపోయింది. పరిశ్రమలు తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయగల దేశాలకు తరలిపోయాయి.దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ అధికంగా ఫైనాన్షియల్ సర్వీసులపై ఆధారపడిపోయింది.ముఖ్యంగా లండన్ నగరం కేంద్రంగా బ్యాంకింగ్,ఇన్వెస్ట్‌మెంట్ రంగాలు విస్తరించాయి.కానీ ఈ రంగాలు దేశవ్యాప్తంగా సమాన అభివృద్ధిని తీసుకురాలేకపోయాయి.లండన్ సంపన్నంగా మారుతుంటే, ఇతర ప్రాంతాలు వెనుకబడిపోయాయి.2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం బ్రిటన్‌కు పెద్ద దెబ్బగా మారింది.బ్యాంకింగ్ రంగంపై అధిక ఆధారపడటం కారణంగా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది.ఆ తర్వాత ప్రభుత్వం భారీ వ్యయ నియంత్రణ విధానాలను అమలు చేసింది. ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం వల్ల ఆరోగ్యం, విద్య, స్థానిక సంస్థలు, సామాజిక సంక్షేమ రంగాలు నిధుల కొరతను ఎదుర్కొన్నాయి.ఈ ప్రభావం ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. ప్రజా సేవల నాణ్యత క్రమంగా పడిపోయింది.బ్రిటన్ ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే దీర్ఘకాలిక నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం.ఉత్పాదక రంగాన్ని పునరుద్ధరించడం, టెక్నాలజీ రంగంలో పెట్టుబడులు పెంచడం,గృహ నిర్మాణాలను వేగవంతం చేయడం,విద్య నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టడం కీలకం.అలాగే ప్రాంతీయ అసమానతలను తగ్గించి లండన్ వెలుపల ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.బ్రిటన్ ఒక్కసారిగా కుప్పకూలిపోతున్న దేశం కాదు. కానీ గత కొన్ని దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక సమస్యలు ఇప్పుడు స్పష్టంగా బయటపడుతున్నాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని నడిపించిన దేశం, నేడు తన ఆర్థిక భవిష్యత్తును తిరిగి నిర్వచించుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ సంక్షోభం నుంచి బయటపడగలదా లేదా అనేది రాబోయే సంవత్సరాల్లో తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం మాత్రం బ్రిటన్ ఒక కీలక మలుపు వద్ద నిలబడి ఉంది.

# బీజేపీ చీలిక రాజకీయం


విలువల రాజకీయాలంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన బీజేపీ గత పన్నెండేండ్ల పైచిలుకు పాలనలో ప్రతినిత్యం విలువలకు పాతరేస్తూ వచ్చింది. వికృత రాజకీయ క్రీడలో కాంగ్రెస్ కన్నా రెండాకులు ఎక్కువే చదివి విపరీత పోకడలు పోతున్నది. ఇప్పుడు తన ప్రత్యేక ఎజెండాసాధనకు వేస్తున్న ఎత్తుగడల్లో భాగంగా ప్రజాస్వామ్యాన్ని ప్రహసనంగా మారుస్తున్నది. కశ్మీర్‌కు సంబంధించిన 370 అధికరణం ఎత్తివేయడం, ప్రణాళికా సంఘాన్ని మూలకు నెట్టడం వంటివి ఈ సరికే సాధించుకోగలిగింది. ఏమాత్రం అవకాశం దొరికినా ఇంకా చాలానే చేయాలనేది బీజేపీ అత్యాశ. ఒకే దేశం ఒకే ఎన్నిక, ఒకే విధానం, ఒకే నేత.. ఇలా లిస్టు చాలా పెద్దదే. మోదీ మొదటిసారికన్నా రెండోసారి మెజారిటీ పెంచుకున్నారు. అదే ఊపు అలాగే కొనసాగి మూడో విడుతలో 400 మార్కు దాటుతామేమోనని కమలదళానికి ఆశ కూడా కలిగింది. అయితే ఓటర్లు ఆ పార్టీకి ఉన్న మెజారిటీని ఊడగొట్టి మూలకు నెట్టారు. అయితేనేం..ఇతర పార్టీల మద్దతుతో కేంద్రంలో అధికారాన్ని నిలబెట్టుకోగలిగింది బీజేపీ. ప్రస్తుతం నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులను పార్లమెంటులో ఆమోదింప జేసుకోవడం తక్షణ కర్తవ్యంగా ఉన్నదన్నది బహిరంగ రహస్యమే. అందుకు అవసరమైన బలం పెంచుకునేందుకు నానా గడ్డి మేస్తున్నది. ఒకప్పుడు కాంగ్రెస్ నిస్సిగ్గుగా పాల్పడిన రాజకీయ అకృత్యాలన్నిటినీ ఇప్పుడు అనుసరిస్తున్నది. రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడే బీజేపీ ఆ విలువలను కట్టగట్టి అటకెక్కిస్తున్నది. గవర్నర్ల వ్యవస్థను భ్రష్టుపట్టించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు దుర్వినియోగపరుస్తున్నది. న్యాయవ్యవస్థపై పట్టుకోసం జాతీయ న్యాయ నియామక మండలి (ఎన్ జాక్) తీసుకువచ్చి సుప్రీంకోర్టు తిరస్కరణతో చేతులు కాల్చుకున్నది. ఇప్పుడు పార్లమెంటులో తమ బలం పెంచుకునేందుకు విపక్షాలను చీల్చేందుకు అనైతిక ఎత్తుగడలను అమలు చేస్తున్నది. మరో రెండేండ్లలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో సొంతంగా బలం పెంచుకునేందుకు నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులే దిక్కని బీజేపీ గట్టిగా నమ్ముతున్నట్టున్నది. అయితే ఆ బిల్లులను ఒడ్డున పడేయాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి. ఆ మేరకు పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ కూడా లేదనే సంగతి తెలిసిందే. మొన్నటికి మొన్న



బెంగాల్ ఎన్నికల ముందు నాటకీయమైన రీతిలో ఆ బిల్లులను కలగలిపి ప్రవేశపెట్టి అపజయాన్ని మూటగట్టుకున్నది. దేశంపై రాజకీయంగా తన పట్టు బిగించేందుకు పై రెండు బిల్లులు సానుకూల వాతావరణం తీసుకువస్తాయని బీజేపీ భావన. అందుకు విపక్షాలను చీల్చే అప్రతిష్ఠాకరమైన ఎత్తుగడలకు పాల్పడుతున్నది. బెంగాల్ ఎన్నికల దరిమిలా తృణమూల్‌ను నిలువునా చీల్చింది. ఆ పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు వేరుకుంపటి పెట్టారు. వారు నేరుగా బీజేపీలో చేరకుండా అధికారికంగా నమోదు కాని త్రిపురకు చెందిన ఎన్సీపీఐ (నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా)లో చేరారు. అయితే వారు ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించడం మాత్రం మరువలేదు. దీనిని బట్టే టీఎంసీ చీలిక వెనుక ఎవరున్నదీ చెప్పకనే తెలిసిపోతున్నది. ఢిల్లీలో ఆప్ నుంచి మొదలుకొని మహారాష్ట్రలో ఎన్సీపీ దాకా బీజేపీ చీలిక ఎత్తుగడలకు బలికాని ప్రాంతీయ పార్టీలు దేశంలో బహు తక్కువగా మిగిలి ఉన్నాయి. తాజాగా మహారాష్ట్రలో శివసేన చీలికవర్గంలో మరో చీలికకు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం ఉద్ధవ్ బాల్ ఠాక్రే వర్గంలో ఉన్న 9 మంది ఎంపీల్లో ఆరుగురు మహారాష్ట్ర బీజేపీ కూటమిలో భాగస్వామిగా ఉన్న షిండే వర్గంలో చేరుతామని అంటున్నారు. ఈ చీలిక వెనుక బీజేపీ పాత్రను రుజువు చేయడానికి ఇంతకన్నా సాక్ష్యాలు కావాలా? అంతా బహిరంగ రహస్యమే. పైగా ఫిరాయింపు ఎంపీలకు పెద్ద ఎత్తున డబ్బు ఆశ చూపారనే ఆరోపణలు వెల్లువెత్తుతుండటం గమనార్హం. మరోవైపు ఎన్నికల వ్యవస్థను అడ్డు పెట్టుకుని తమవారిని పార్లమెంటుకు పంపే ఎత్తుగడలకూ బీజేపీ వెనుకాడటం లేదు. విలువల పేరిట కాంగ్రెస్‌పై పోరాడినట్టు దేశాన్ని మభ్యపెట్టిన బీజేపీ అదే కాంగ్రెస్ బాటలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుండటం విడ్డూరం. అందుకు కాంగ్రెస్ తెచ్చిన ఫిరాయింపు వ్యతిరేక చట్టం ఓ సాధనంలా మారడం మరీ విడ్డూరం.

# మరస్పర్శ మానవస్పర్శను మించగలదా!

భారతదేశపు నేటి రాజకీయ నాయకులకు 'కృత్రిమ మేధ' ఒక ఊతపదమైపోయింది. కొందరైతే అనాదిగా వస్తున్న 'మానవ కేంద్రీకృత ప్రజారోగ్య సంరక్షణ' కంటే ఈ కృత్రిమమేధతో కూడిన మరబొమ్మల వైద్య సంరక్షణే మెరుగన్న ఆపోహతో మాట్లాడుతున్నారు. ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నట్టు, ఏకంగా భవిష్యత్తులో కృత్రిమమేధతో కూడిన ఆసుపత్రులు, రోగ పరీక్షా కేంద్రాలు, మందుల దుకాణాలూ తెరిచేస్తామనే బీరాలు పలికేంతవరకూ విషయం వెళ్లిపోయింది. వైద్య విధానమంతా ఇద్దరు వ్యక్తులతో ముడిపడి ఉంటుంది. మొదటి వ్యక్తి-- నిజంగా రుగ్మత ఉన్న, లేదా ఉందని భావిస్తున్న రోగి. రెండో వ్యక్తి-- వైద్యుడు. వీరిరువురి మధ్య వ్యవహారాన్నే వైద్య పరిభాషలో మనం సంప్రదింపు (కన్సల్టేషన్) అంటున్నాం. ఆధునిక వైద్య చికిత్సా విధివిధానం ఇలా ప్రాథమికంగా వినడం, మాట్లాడటం, స్పృశించడం, వైద్యునికీ రోగికీ నడుమ కాలాతీతమైన ఒక బాంధవ్యాన్ని నెలకొల్పడం అనే నాలుగు మూలస్తంభాలపై ఆధారపడి ఉంది. టెక్నాలజీ పెరిగేకొద్దీ ఈ విధానంలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. ఇప్పుడు వైద్యుడు రోగితో మాట్లాడే సమయం తగ్గిపోయింది. దానికి బదులుగా, ఉక్కిరిబిక్కిరి చేసే మెడికల్ టెస్టుల ఆధారంగా రోగాన్ని నిర్ధారించడం పెరిగింది. ఇప్పుడు ఈ పరిస్థితిలోకి అదనంగా కృత్రిమమేధను కూడా చొప్పిస్తే అది గోరుచుట్టు మీద రోకలిపోటయ్యే ప్రమాదం ఉన్నది. వైద్యుడు--రోగి ఇరువురూ రోగనిదాన క్రియలో ఎంతో కీలకం. రోగి బెడ్ వద్దకు వైద్యుడు ఆత్మీయంగా చేరగానే రోగికి కొండంత అండ దొరికినట్టు ఉంటుంది. వైద్యుడి స్పర్శ రోగి దేహానికి అమృత సమానంగా, వైద్యుడి మాట రోగి మనసుపై మంత్రంగా పనిచేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వసనీయమైన వైద్యుడు రోగికి ప్రసాదించే ఆ ఒక్క కరస్పర్శ-- సంజీవిని. అలాంటిది, ఒక రోబోటిక్ స్పర్శ ఈ సజీవ స్పర్శకు సరితూగుతుందా? అసలైన మానవ స్పర్శను సమూలంగా తొలగించి ఆ లోటును భర్తీ



చేయగలుగుతుందా?

ఆధునిక చికిత్సా విధానంలో వైద్యుడు నిర్వహించే మరో పార్శ్వం కూడా ఉంది. రోగనిర్ధారణకు ప్రామాణికాలుగా ఎన్నో విధివిధానాలు, దశలవారీ సూచనలు ఉపలభ్యం అవుతూ ఉండొచ్చు. కానీ అనుభవజ్ఞుడైన వైద్యుడు వీటన్నింటినీ గుడ్డిగా అనుసరించడు. తన తెలివినీ, విజ్ఞానాన్నీ, ఏళ్ల తరబడి గడించిన అపారమైన అనుభవాన్నీ రంగరించి ఒక్కొక్క రోగికీ సంబంధించిన రుగ్మతను అతడి ప్రత్యేక శరీర ధర్మానుగుణంగా నిర్ధారిస్తాడు. హెచ్చుతగ్గులను బేరీజు వేసి మరీ తగిన చికిత్సను సూచిస్తాడు. ఎందుకంటే, అన్నింటినీ ఒకే రాటకు కట్టలేం. ఒకే రోగానికి వేరు వేరు వ్యక్తులు వేరు వేరు విధంగా ప్రతిస్పందిస్తారు. ఆ స్పందించిన తీరుపై ఆధారపడి వైద్యుడి చికిత్స ఉంటుంది. అది ఎప్పుడూ ఎవరికి తగ్గట్టు వారికిగా వ్యక్తిగతీకరించబడి ఉంటుంది. అంతేతప్ప, జనసామాన్యంగా, 'పిడుగుకు, బియ్యానికి ఒకే మంత్రం'లా, ఒక మూసలో పోసినట్టు ఉండదు. ఇలాంటి నైశిత్యం మరమనిషి తరం కాదు! సమగ్ర బుద్ధితో, సందర్భ శుద్ధితో, ఏళ్ల తరబడి అనుభవంతో వైద్యుడు చేసే రోగ నిర్ధారణ విధానంతో కృత్రిమ మేధ ఎన్నటికీ తలపడలేదు. తన విషయ సంపదతో రోగనిర్ధారణ సమయంలో కచ్చితత్వానికి కొంత ఆలంబనగానూ, శస్త్ర చికిత్సలో మర చేతుల చేత సునిశితత్వాన్ని సాధించే ఒక విలువైన పనిముట్టుగానూ మాత్రమే ఆధునిక వైద్యుడికి ఈ కృత్రిమమేధ ఉపయోగపడుతుంది. ఆ పరిధికి మాత్రమే కృత్రిమమేధ ఉపయోగాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, నేటి వైద్యంలో అవధులు దాటిన కృత్రిమమేధ వినియోగం సృష్టించే ఆపదలు ఎన్నో మనం ఇప్పటికే కళ్లారా చూస్తున్నాం, చెవులారా వింటున్నాం. కొందరు రోగులు కృత్రిమ మేధ సహాయంతో తమకు తామే రోగ నిర్ధారణను పూర్తి చేసేసుకుని, ఆ తర్వాత మొక్కుబడిగా, 'శంఖంలో పోస్తేనే గానీ తీర్థం కాదన్న'ట్టుగా మాత్రమే వైద్యుడి దగ్గరకు వస్తున్నారు. ఈ ఒరవడి ఎంతో ప్రమాదకరం. నా స్వానుభవం ఒకటి ఇక్కడ చెప్పదలచాను. ఒక మహిళకు మొహం మీద పెద్ద ప్రమాదం లేని దద్దుర్లు వచ్చాయి. కానీ ఆమె కృత్రిమ మేధను వాడి ఆ దద్దుర్లను 'సిస్టెమిక్ లూపస్ ఎరితమటోసిస్' (రాజు) అనే భయంకరమైన ఆటో ఇమ్యూన్ వ్యాధిగా నమ్మింది. ఎంత నచ్చచెప్పినా ఆమె వినలేదు. చివరికి అది రాజు కాదని తేల్చడానికి అనవసరంగా ఎన్నో పరీక్షలను ఆమెకు చేయించాల్సి వచ్చింది. ఆ ఫలితాలన్నీ నెగిటివ్‌గా వచ్చాక గానీ ఆమె ఊపిరి పీల్చుకోలేదు. ఇలా కృత్రిమమేధపై పూర్తిగా ఆధారపడిపోయిన అజ్ఞానంతో ఎందరో అనవసర వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. కృత్రిమమేధ ఆధునిక వైద్య విజ్ఞానాన్ని మెరుగుపరిచే ఒక అనుబంధంగా ఉపయుక్తం కావచ్చు. కానీ దాని స్థానాన్ని పూర్తిగా ఆక్రమించగలిగే ఒక ప్రత్యామ్నాయం మాత్రం ఎన్నటికీ కాలేదు. ఇది ముమ్మాటికి నిజం.

# చీలిక దిశగా సమాజ్ వాదీ పార్టీ

తృణమూల్ కాంగ్రెస్ లో చీలికలు, శివసేన ఉద్ధవ్ వర్గంలో చీలికలు.. తాజాగా మరో పార్టీ కూడా చీలిక దిశగా ప్రయాణిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే సమాజ్ వాదీ పార్టీ. యూపీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ వార్త పెద్ద సంచలనం రేపుతోంది.సమాజ్ వాదీ ఎంపీలంతా బీజేపీ వైపు చూస్తున్నట్లు మంత్రి ఓం ప్రకాశ్ రాజ్ భర్ పెద్ద బాంబు పేల్చారు. దీంతో దేశ రాజకీయాలు ఆసక్తిగా మారాయి.సమాజ్ వాదీ పార్టీలో భారీ చీలిక తప్పదని, ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు ఇప్పటికే బీజేపీ వైపు వెళ్లేందుకు సిద్ధంగా వున్నారంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మహారాష్ట్రపైనే దృష్టి పెట్టొద్దని, ఇప్పుడు యూపీ వంతు వచ్చిందంటూ వ్యాఖ్యానించారు. ఎవరైనా కొనుగోలు కావడానికి సిద్ధంగా వుంటేనే వారిని ఎవరైనా కొనుగోలు చేస్తారు. మహారాష్ట్ర గురించే కాకుండా యూపీ పై కూడా దృష్టి నిలపాలని మంత్రి అందులో పేర్కొన్నారు.సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు, అఖిలేష్ యాదవ్ బాబాయి అయిన రామ్ గోపాల్ యాదవ్ ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి ఒక లేఖను అందజేశారని, ఆ లేఖ పార్టీలోని ఒక వర్గం బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై సమాజ్‌వాదీ పార్టీ లేదా బీజేపీ నుండి ఎటువంటి స్పష్టతా రాలేదు.తృణమూల్ కాంగ్రెస్ లేదా శివసేన లో జరిగినట్లుగా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన సమాజ్‌వాదీ పార్టీలో ప్రస్తుతం చీలిక వచ్చే అవకాశం లేదని అక్కడి రాజకీయ పరిశీలకులు మరియు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఇటీవల కొన్ని అంతర్గత విభేదాలు మాత్రం వున్నట్లు సమాచారం.027 ఎన్నికలకు ముందు టికెట్ల కేటాయింపు విషయంలో కొందరు నాయకుల మధ్య అసంతృప్తి తలెత్తే అవకాశం ఉందని, ఇది పార్టీ మరియు అఖిలేష్ ప్రణాళికలకు విఘాతం కలిగించవచ్చని వారు భావిస్తున్నారు. గత రాజ్యసభ ఎన్నికల్లో జరిగిన క్రాస్-వోటింగ్ ఉదంతాలతో కూడా పరిశీలకులు దీనిని ముడిపెడుతున్నారు.క్షణమే చీలిక వచ్చే సూచనలేవీ కనిపించనప్పటికీ, రాజ్‌భర్ చేసిన వ్యాఖ్యలు మాత్రం ఖచ్చితంగా ఒక రకమైన ప్రకంపనలను రేకెత్తించాయి. ఏది ఏమైనా, రాజకీయాల్లో ఏం జరుగుతుందో అంచనా వేయడం కష్టం; ఎప్పుడు మిత్రులు అకస్మాత్తుగా శత్రువులుగా మారుతారో, లేదా ఎప్పుడు చిరకాల రాజకీయ ప్రత్యర్థులు ఊహించని విధంగా మిత్రులుగా మారతారో ఎవరూ చెప్పలేంఅయితే, ఒకవేళ ఎస్పీలో చీలిక ఏర్పడితే, దాని ప్రభావం ప్రధానంగా వచ్చే ఏడాది?అంటే 2027లో?జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై పడుతుంది. అంతేకాకుండా, పార్లమెంటరీ సమీకరణాలు కూడా మారవచ్చు. ప్రస్తుతం రాజ్యసభలో ఎస్పీ ప్రధాన ప్రతిపక్ష పార్టీలలో ఒకటిగా ఉంది, అలాగే రామ్ గోపాల్ యాదవ్ ఆ పార్టీకి చెందిన ప్రముఖ వ్యక్తి మరియు బలమైన గొంతుకగా ఉన్నారు. రాజ్యసభలో సమాజ్‌వాదీ పార్టీకి మొత్తం నలుగురు ఎంపీలు ఉన్నారు. ఒకవేళ పెద్ద సంఖ్యలో రాజ్యసభ ఎంపీలు పార్టీ మారితే, సభలో ప్రతిపక్షం బలహీనపడి, ప్రభుత్వం తన బిల్లులను సులభంగా ఆమోదించుకునే అవకాశం ఏర్పడుతుంది.

# పల్స్ పోలియోపై అవగాహన సదస్సు

**నిండు జీవితానికి రెండు చుక్కలు.**

**అంగవైకల్యం నిర్మూలనే లక్ష్యంగా పోలియో చుక్కలు**

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శ్రీగిరి పల్లి**

**డాక్టర్ .బల్వీర్ సింగ్ వైద్యాధికారి**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐటీసీ ఆఫీస్ సముదాయంలో ఈరోజు హెల్త్ సిబ్బందికి ఆశా కార్యకర్తలకు అంగన్వాడి టీచర్లకు పోలియో పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీగిరిపల్లి వైద్యాధికారి డాక్టర్ బల్బీర్ సింగ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు అంగవైకల్యం రాకుండా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఆదివారం ఈ నెల 28 వ రోజున అన్ని గ్రామాలలో ఏర్పాటుచేసిన పోలియో కేంద్రాల వద్ద ఐదు సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ నందు ప్రజ్ఞాపూర్ గజ్వేల్ బస్టాండ్ యందు కేంద్రాలు ఏర్పాటు చేయబడిన అన్నారు. నిండు జీవితానికి రెండు చుక్కలు చాలు అని తల్లిదండ్రులకు ఎంత పని ఉన్నా ఆరోజు మీ పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో సోకిన వ్యక్తి కుంటి కాలు కుంటి చేయి తో అంగవైకల్యంతో జీవితాంతము బాధపడాల్సి ఉంటుందని కాళ్లు చేతులు చచ్చుబడిపోతాయని పిల్లల్లో అంగవైకల్యం వచ్చి పక్షవాతం కి దారితీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ సిహెచ్ఓ ఎస్ యాదగిరిరావు. ఆరోగ్య కేంద్రం సి. హెచ్ .ఓ. కాశీం క్లస్టర్ సబ్ యూనిట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్. సురేందర్ ఎం.పీ. హెచ్ .ఈ .ఓ స్థానిక సూపర్వైజర్ అనిత, అంగన్వాడి సూపర్వైజర్ శ్రీలక్ష్మి. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, వాలంటీర్లు, యువజన సంఘ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దేశ సమైక్యత స్ఫూర్తితో ముందుకు సాగాలి




**అప్పుడే శ్యామప్రసాద్ ముఖర్జీ త్యాగానికి నిజమైన నివాళి**

**ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**

అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):

దేశ సమైక్యత, సమగ్రత స్ఫూర్తితో ప్రతి భారతీయుడు ముందుకు సాగినప్పుడే డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ త్యాగానికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు.భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, ప్రముఖ జాతీయవాది, విద్యావేత్త డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ 125వ వర్ధంతి (బలిదాన్ దివస్) సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాజీ గవర్నర్లు విద్యాసాగర్ రావు, బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో కలిసి శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమరయ్య మాట్లాడుతూ.. భారతదేశ సమగ్రత, ఐక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు శ్యామప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ సమైక్యత కోసం ఆయన కలలుగన్న ఆశయాలు నేడు సాకారమవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. దేశ సమైక్యత కోసం శ్యామప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ సమగ్రతను బలోపేతం చేసే నిర్ణయాలు అమలవుతున్నాయని, కాశ్మీర్ దేశంలో అంతర్భాగంగా మరింత బలోపేతం కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## కనీస వేతనాల జీవోను వెంటనే సవరించాలి



**25న సెంట్రల్ లేబర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా**

అగ్ని ధార న్యూస్,( రామగుండం):

కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీవోను వెంటనే సవరించి విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్జీ–1 పరిధిలోని వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న సివిల్, సివిక్ కాంట్రాక్టు కార్మికులకు మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న ఎన్టీపీసీలోని సెంట్రల్ లేబర్ కమిషనర్ (ఏసీఎల్) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీవోలను సవరించి విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వేతనాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వెంటనే కనీస వేతనాలను నెలకు రూ.26 వేలకు పెంచేలా జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పీఎఫ్, బోనస్‌లపై ఉన్న సీలింగ్‌ను ఎత్తివేసి అందరికీ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గోదావరిఖని పట్టణ కార్యదర్శి మేదరి సారయ్య, నాయకులు ఉపేందర్, రాజు, రామానుజం, రాజేందర్, కేతమ్మ, కనకలక్ష్మి, స్వప్న, సునీత, కృష్ణవేణి, జ్యోతి, స్వరూప, శాంతి, వినోద, నాగమణి, వసంత, ప్రసాద్, శ్రీనివాస చారి, చందు, రాజేశ్వరి, దీక్ష కుమారి, మమత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాల పంపిణీ



అగ్నిధార న్యూస్ కమన్పూర్

కమాన్పూర్ మండలం లోని జూలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10000 రూపాయలు విలువ చేసే పుస్తకాలను విద్యార్థులకు సర్పంచ్ పోలుదాసారి వనిత సాయి కుమార్, చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగరాజు,వేణుగోపాల్,శ్రీదేవి,పాల్గొనారు ...

## నిరుపేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



**ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ సింహరాజు కోదండరాం**

**దాతల సేవలు ఆదర్శప్రాయం: వక్తలు**

అగ్నిధార న్యూస్,( రామగుండం):

గోదావరిఖనిలోని ఎన్టీపీసీ సాయి సేవా సమితిలో మంగళవారం నిరుపేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని వాసవి అధ్యక్షుడు కొమురవెల్లి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ 320జీ జిల్లా గవర్నర్ సింహరాజు కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై, యూకేజీ నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది నిరుపేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న దాతలు కొమురవెల్లి అరుణ--సుధాకర్ దంపతులను అభినందించారు. వారి సేవలు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తాయని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ అభివృద్ధి సమన్వయకర్త బంక రామస్వామి, ప్రాంతీయ అధ్యక్షుడు కజంపురం రాజేందర్, మండల అధ్యక్షుడు నార్ల ప్రసాద్, లయన్స్ సభ్యులు కోదాటి ప్రవీణ్, దొండపాటి మహేందర్ రెడ్డి, కొమురవెల్లి రాహుల్, కొమురవెల్లి రోహిత్, ధరణి పోచం, మెట్పల్లి అనిల్‌రావు, ఇల్లెందుల శ్రీనివాస్, దొంతుల గంగాధర్, ఆముల శ్రీనివాస్, కొమురవెల్లి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అలాగే సాయి సేవా సమితి అధ్యక్షుడు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అభివృద్ధి పేరుతో క్వార్టర్ల తొలగింపు సహించం

**ఏఐటియుసి హెచ్చరిక..**

**నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్**

అగ్ని ధార న్యూస్,(రామగుండం):



అభివృద్ధి పేరుతో సింగరేణి కార్మికుల క్వార్టర్లను తొలగించే ప్రయత్నాలను ఏఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ హెచ్చరించారు. కార్మికుల క్వార్టర్లకు ఆనుకుని వారు సొంత ఖర్చుతో నిర్మించుకున్న షెడ్లను తొలగించేందుకు ఆర్జీ–1 యాజమాన్యం నోటీసులు జారీ చేయడాన్ని ఆయన ఖండించారు. గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐటియుసి ఆర్జీ–1 బ్రాంచి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించకుండా యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. గతంలో అభివృద్ధి పనుల కోసం క్వార్టర్ల తొలగింపునకు సహకరించినప్పటికీ, ఇకపై కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. సింగరేణిలో కొత్త గనులు ప్రారంభం కాకపోవడంతో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిందని, కార్మికులే లేకుండా అభివృద్ధి ఎవరి కోసం చేస్తున్నారో ప్రభుత్వం, యాజమాన్యం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గోదావరిఖని వంకబెండు నుంచి చౌరస్తా వరకు ఉన్న క్వార్టర్ల తొలగింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధిత కార్మిక కుటుంబాలతో కలిసి ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశానికి ముందు బాధితులు అందజేసిన వినతిపత్రాన్ని ఆయన నాయకులతో కలిసి స్వీకరించారు. సమావేశంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీనివాస్, నాయకులు సదానందం, ఎస్. వెంకట్ రెడ్డి, బాధిత కార్మికులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనమే అధిక దిగుబడికి తొలి అడుగు

**ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యం**

అగ్నిధార న్యూస్ మహమ్మదబాద్:

మరియు నంచర్ల రైతు వేదికలో విత్తన మేళా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా (సీడ్ మేళా) ప్రచార కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణ, మండల వ్యవసాయ అధికారి నరేందర్ మరియు మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు రామ్ లాల్ పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలు అందించడంతో పాటు ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విత్తన మేళాలో నాణ్యమైన ధృవీకరించిన విత్తనాల వినియోగం, అధిక దిగుబడులు ఇచ్చే వంగడాల ఎంపిక, పంటల వైవిధ్యీకరణ, నీటి లభ్యతకు అనుగుణమైన పంటల సాగు, సమగ్ర పంట సంరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీపీటీ--5204, ఆర్ఎన్ఆర్--15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, కేఎన్ఎం--1638, కేఎన్ఎం--7715, డబ్ల్యూజీఎల్--44, జై శ్రీరామ్ తదితర అధిక దిగుబడి వరి రకాలను రైతులకు పరిచయం చేశారు. అలాగే అధిక నీటి అవసరం ఉన్న పంటలకు ప్రత్యామ్నాయంగా కంది, పెసర, మినుములు, నువ్వులు, కూరగాయల పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నంచర్ల గ్రామ సర్పంచ్ శ్రీ గాయత్రీ దేవి, చిన్నాయపల్లి సర్పంచ్ శ్రీనివాస్, ముందలి తండ సర్పంచ్ అంజ్య, ఏపీఎం నిర్మల , మాజీ ఎంపీపీ శాంతి రంగ్య, మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బిక్షపతి, వ్యవసాయ శాఖ అధికారులు పవన్, దీపిక, నిఖిత, దివ్య, రైతులు పాల్గొన్నారు..

## భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ ఘన నివాళులు

**గజ్వేల్ బిజెపి నాయకులు..**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి ఆధ్వర్యంలో “ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా” అనే లక్ష్యంతో కాశ్మీర్ కోసం ప్రాణాలర్పించిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రాతఃస్మరణీయులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఘన నివాళులు అర్పించిన గజ్వేల్ బిజెపి నాయకులు.ఈ సందర్భంగా బిజెపి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ గార్లు మాట్లాడుతూ సాంస్కృతిక, ఆర్థిక జాతీయవాదమే పునాదిగా.. భారతీయ సనాతన ధర్మరక్షణే ధ్యేయంగా.. భారతీయ జన సంఘ్ ను స్థాపించిన మార్గదర్శి అఖండ భారతమే ఆదర్శంగా దేశ ప్రజల సంఘటితమే సిద్ధాంతంగా పనిచేసిన కర్మశీలి.. ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిశాన్ నహి చలేగా అని నినదించిన ధైర్యశాలి.. పటిష్ట జాతీయ భావజాల నిర్మాణమే పరమావధిగా తన జీవితాంతం హైందవ సాంస్కృతిక వికాసం కోసమే కృషి చేసిన నిత్యచైతన్యశీలి డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివాస్ సందర్భంగా ఆ మహనీయునికి వినమ్ర శ్రద్ధాంజలి ఘటిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, 4వ వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, జిల్లా నాయకులు నత్తి శివకుమార్, కోదండం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకట్ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మరియు మండల ప్రధాన కార్యదర్శులు నాయిని సందీప్ కుమార్, మదుగురి నరసింహ ముదిరాజ్, బారు అరవింద్, బిజెపి పట్టణ కార్యదర్శి చిక్కుడు ప్రసాద్, కేతవత్ ఆంజనేయులు, రాజేశ్వర్ చారి, తిప్పతి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రిపోర్టర్ నర్సింలు ను పరామర్శించిన గోలి సంతోష్ గుప్తా



**కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న నర్సింలు కుటుంబ సభ్యులు**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ మండలం బంగ్లా వెంకటపూర్ గ్రామానికి చెందిన సిటీ తెలంగాణ రిపోర్టర్ నర్సింలు రెండవ కుమార్తె రాగిని ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా మంగళవారం రిపోర్టర్ నర్సింలు ను పరామర్శించిన బి ఆర్ నేత సీనియర్ నాయకుడు, ఫర్టిలైజర్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గోలి సంతోష్, నర్సింలు ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, చిన్నారి రాగిని మరణం బాధాకరం అని క్షణిక ఆవేశంలో ఆత్మహత్య చేసుకోవడం తల్లి తండ్రులకు శోకం తప్ప ఏమి లేదని, యువతి యువకులు చదువు మీద దృష్టి పెట్టి,ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అన్నారు,నర్సింలు కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## వాజేడు మండలంలో ప్రీ-ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయాలి

**ఎంఈవోకు ప్రజా పోరాట సమితి వినతిపత్రం**

అగ్ని ధార న్యూస్, ( వాజేడు):



ములుగు జిల్లా వాజేడు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ ప్రీ–ప్రైమరీ (నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ) పాఠశాలలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజా పోరాట సమితి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు స్పందిస్తూ, ములుగు జిల్లాలో అక్షర క్రమం (ఏ టు జెడ్) ప్రకారం ప్రీ–ప్రైమరీ పాఠశాలల నమోదు ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే వాజేడు మండలానికి కూడా ప్రీ–ప్రైమరీ పాఠశాలలు మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రజా పోరాట సమితి నాయకుడు ముత్తెబోయిన మహేందర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో అధికంగా నిరుపేద కుటుంబాలు నివసిస్తున్నాయని, వాజేడు మండలంలో ప్రభుత్వ ప్రీ–ప్రైమరీ పాఠశాలలు లేకపోవడంతో సుమారు 300 నుంచి 400 మంది చిన్నారులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిమంది మాత్రమే సమీపంలోని చెరుకూరు గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్తుండగా, చిన్నారులు ప్రతిరోజూ బస్సుల్లో ప్రయాణించడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ధర్మవరం, అయ్యవారిపేట, కోరకల్ గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ప్రీ–ప్రైమరీ పాఠశాలలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ప్రీ–ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేసేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ప్రజా పోరాట సమితి ప్రతినిధులు కొత్తగట్టు రాము, గగ్గూరి నాగేంద్రబాబు, గౌరారపు చంద్రశేఖర్‌తో పాటు పలువురు గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ విజయవంతం -- ఏబీవీపీ

అగ్నిధార న్యూస్ కమన్పూర్

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పెద్దపెల్లి జిల్లా కమాన్ పూర్ మండలం వ్యాప్తంగా నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ నియంత్రణ, విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈ బంద్ నిర్వహించబడింది.

ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగపల్లి అరవింద్ మాట్లాడుతు, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో విద్యకు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, యూనిఫాంలు మరియు పాఠ్యపుస్తకాల పంపిణీలో జాప్యం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని అన్నారు.రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23 వేల పాఠశాలలను మూసివేస్తామన్న ప్రకటనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని



డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం గ్రామీణ, ఆదివాసీ, గిరిజన, దళిత మరియు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపును కచ్చితంగా అమలు చేయాలని కోరారు.

# డ్రగ్స్ సమాచారాన్ని పోలీసులకు అందించండి..

**'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా ముందుకు రండి**
**:పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి.**

అగ్నిధార న్యూస్ కమన్పూర్

జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా,జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జోన్‌లోని కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నాయకత్వంలో డ్రగ్స్ నిర్మూలనను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఈ లక్ష్యంతో ప్రత్యేకంగా డీజీ స్థాయి అధికారితో "ఈగల్" విభాగాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకొని తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం చేపడుతున్న డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలకు స్థానిక పోలీసులు,సర్కిల్ అధికారులు,ఏసీపీలు సమన్వయంతో




పనిచేస్తూ ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. విద్యకు ప్రాధాన్యత ఇచ్చే పాఠశాలల నుంచే ప్రతిభావంతులైన విద్యార్థులు ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ పాఠశాల నుంచి గతంలో మండల స్థాయి టాపర్ రావడం అభినందనీయమని, భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయి టాపర్లుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. గంజాయి,మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు కేంద్ర నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుందని హెచ్చరించారు. తాము మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా,ఇతరులను కూడా వాటి నుంచి దూరంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇందుకోసం 100 లేదా 1908 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల వినియోగంపై సమాచారం అందించి సమాజాన్ని రక్షించడంలో ప్రతి విద్యార్థి "యాంటీ డ్రగ్ సోల్జర్"గా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గంజాయి,మత్తు పదార్థాలకు సంబంధించిన చట్టవ్యతిరేక కార్యకలాపాల సమాచారం మీలో ఎవరు పోలీసులకు అందిస్తారని డీసీపీ ప్రశ్నించగా, విద్యార్థులందరూ చేతులు ఎత్తి డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందిస్తామని తమ మద్దతు తెలిపారు. అలాగే,కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'యాంటీ డ్రగ్ సోల్జర్' సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థులు ఫోటోలు దిగారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ 'యాంటీ డ్రగ్ సోల్జర్'గా మారి సమాజంలో అవగాహన కల్పించాలని,డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని డీసీపీ బి.రామ్ రెడ్డి,ఏసీపీ ఎం.రమేష్ పిలుపునిచ్చారు.

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలి

**90 వేల మంది కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి**
**రాష్ట్ర మహాసభలో డిమాండ్**

అగ్ని ధార న్యూస్, (రామగుండం):

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న యూనియన్ నాలుగో రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ యూనిట్ నాయకులు ఎం.ఏ. గౌస్, మద్దెల దినేష్ మంగళవారం మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే విధానంలో పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికులను దోపిడీ చేస్తున్న కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి అందరినీ శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని కోరారు. గత ప్రభుత్వం శాశ్వతీకరణ పేరుతో హామీలు ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. శాశ్వతీకరణ జరిగే వరకు కనీసం నెలకు రూ.26 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 11వ వేతన సవరణ కమిషన్ ప్రకారం కేటగిరీల వారీగా అమలు చేయాల్సిన వేతనాలు కూడా ఇప్పటికీ అమలు కావడం లేదని పేర్కొన్నారు. రక్షణ పరికరాల లేమితో విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల




ఎక్స్‌గ్రేషియా, అంత్యక్రియల కోసం రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. పదవీ విరమణ వయస్సు పూర్తిచేసిన కార్మికులకు రూ.5 లక్షల ప్రయోజనం కల్పించాలని డిమాండ్ చేశారు. అనేక మున్సిపాలిటీల్లో ఎనిమిది గంటల పనికి బదులుగా 12 గంటలు పనిచేయిస్తున్నారని, ఇది శ్రమదోపిడీ అని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది గంటల పనిదినాన్ని కచ్చితంగా అమలు చేయాలని, పారిశుద్ధ్య కార్మికులకు సాధారణ సెలవులు, సంపాదిత సెలవులు, వారాంతపు సెలవులు కల్పించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల వేతనాలను ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించి ప్రతి నెల మొదటి తేదీన ట్రెజరీ ద్వారా చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రతి జిల్లా కేంద్రంలో ఉద్యోగుల రాష్ట్ర బీమా వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని, జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు, రాజ్యాంగ నిబంధనలు అమలు కావడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడు యేసురత్నంతో పాటు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ యూనిట్‌కు చెందిన ఐదుగురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలి

**12వ వేతన ఒప్పందం వెంటనే ప్రారంభించాలి**
**జాతీయ కార్మిక సంఘాల సంయుక్త కమిటీ**

అగ్నిధార న్యూస్,(రామగుండం):

కార్మిక వ్యతిరేక నాలుగు కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేసి, బొగ్గు పరిశ్రమ కార్మికులకు సంబంధించిన 12వ వేతన ఒప్పందం ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని జాతీయ కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. బొగ్గు పరిశ్రమ స్థాయిలో నాలుగు జాతీయ కార్మిక సంఘాల సమాఖ్యలు తీసుకున్న నిర్ణయాల మేరకు సింగరేణిలోని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ సంఘాల నాయకులు గోదావరిఖనిలో సమావేశమై జూలై 1న చేపట్టనున్న సంయుక్త నిరసన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా నాలుగు కార్మిక చట్టాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మిక వ్యతిరేకమైన ఈ నాలుగు చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బొగ్గు పరిశ్రమ కార్మికులకు అత్యంత కీలకమైన 12వ వేతన ఒప్పందాన్ని కార్మిక చట్టాల పేరుతో జాప్యం చేయడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం, బొగ్గు పరిశ్రమ యాజమాన్యం వెంటనే చర్చలు ప్రారంభించి వేతన ఒప్పందాన్ని పూర్తి చేయాలని కోరారు.

సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, నాలుగు కార్మిక చట్టాల రద్దు, 12వ వేతన ఒప్పందం అమలు కోసం జూలై 1న భారీ సంయుక్త నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

**కార్యక్రమాలు:**

జూన్ 29: శ్రీరాంపూర్, భూపాలపల్లిలో గని ద్వారం వద్ద సమావేశాలు, విలేకరుల సమావేశాలు. జూన్ 30: కొత్తగూడెంలో గని ద్వారం వద్ద సమావేశం, విలేకరుల సమావేశం. జూలై 1: కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ఎదుట భారీ నిరసన కార్యక్రమం, అనంతరం విలేకరుల సమావేశం. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు డా. బి. జనక్ ప్రసాద్, నరసింహారెడ్డి, ధర్మపురి, ఏఐటీయూసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, మడ్డి ఎల్లయ్య, సీఐటీయూ నాయకులు రాజిరెడ్డి, రాజమౌళి, హెచ్ఎంఎస్ నాయకులు సారయ్య, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.





## ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి



**అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు.. తల్లిదండ్రులపై పెనుభారం**
**ఎన్ఎస్ఎఫ్**

అగ్నిధార న్యూస్,(మణుగూరు):

మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం మండలాల్లోని ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడారు. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు. పాఠశాల ఫీజులతో పాటు యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్స్, బస్సు ఫీజుల పేరుతో తల్లిదండ్రులను ముక్కుపిండి వసూలు చేస్తున్నారని విమర్శించారు. దీంతో ఎంతోమంది అప్పులు చేసి పిల్లలను చదివించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు గత ఏడాదితో పోలిస్తే 10 నుంచి 20 శాతం వరకు ఫీజులు పెంచగా, పుస్తకాలు, నోట్‌బుక్స్ ధరలు కూడా సుమారు 30 శాతం పెరగడం తల్లిదండ్రులకు అదనపు భారంగా మారిందన్నారు. అడ్మిషన్ ఫీజుల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేస్తుండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం 'మన ఊరు--మన బడి' కార్యక్రమం చేపట్టినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగలేదని పేర్కొన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ విషయంలో విద్యాశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జీవో నెం.1 ప్రకారం ప్రభుత్వ పాఠ్యపుస్తకాలనే ప్రైవేటు పాఠశాలల్లో వినియోగించాలని, అడ్మిషన్ ఫీజులు వసూలు చేయడానికి అనుమతి లేదన్నారు. కేవలం ట్యూషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలని, తల్లిదండ్రుల ప్రతినిధులతో ఫీజు నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అధిక ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా యూత్ లీడర్ గోగు సాయి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి జాడి దినేష్, నాయకులు రాజు, సురేష్, మహేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువును తలపిస్తున్న పోతారం ప్రధాన రహదారి



**అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ దళిత నాయకుడు ఊట్ల శ్రీను**

అగ్ని ధార న్యూస్,(ముత్తారం):

ముత్తారం మండలం పోతారం గ్రామంలో కురిసిన స్వల్ప వర్షానికే ప్రధాన రహదారి చెరువును తలపించేలా నీటమునిగిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని మంథని డివిజన్ దళిత నాయకుడు ఊట్ల శ్రీను ఆరోపించారు. మంగళవారం గ్రామంలో పరిస్థితిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కీలక ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే రహదారుల పరిస్థితి ఇలా ఉంటే మిగతా ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. సోమవారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే గ్రామంలోకి ప్రవేశించే ప్రధాన రహదారి పూర్తిగా నీటితో నిండిపోయి చెరువును తలపిస్తోందన్నారు. దీంతో గ్రామ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో నిర్మించిన సైడ్ డ్రైన్లపై అక్రమ నిర్మాణాలు తొలగించాలని, పూడికతీత చేపట్టాలని గ్రామసభల్లో పలుమార్లు తీర్మానాలు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారని చెప్పారు. గ్రామ కార్యదర్శి, ఎంపీడీవో, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. గతంలో కూడా పారిశుధ్య లోపంతో గ్రామంలో పలువురు అనారోగ్యానికి గురయ్యారని గుర్తుచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించడంతో పాటు సైడ్ డ్రైన్లపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, మురుగుకాలువలను శుభ్రం చేసి గ్రామాన్ని పారిశుద్ధ్యంగా తీర్చిదిద్దాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# అదృశ్యమైపోయిన వీరనారి ఝల్కారీ బాయి కోరీ చరిత్రను వెలుగులోకి తేవాలి

**1857 స్వాతంత్ర్య సమరంలో ఆమె త్యాగానికి తగిన గుర్తింపు ఇవ్వాలి**
**డా. మార్షల్ దుర్గం నగేష్**

అగ్నిధార న్యూస్,( రామగుండం): 1857 తొలి స్వాతంత్ర్య సమరంలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరనారి ఝల్కారీ బాయి కోరీ చరిత్రను ఉద్దేశపూర్వకంగా మరుగున పడేశారని సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఝల్కారీ బాయి 168వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో దళితులు, బహుజనులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల త్యాగాలకు తగిన స్థానం కల్పించలేదని విమర్శించారు. చరిత్ర రచనలో అనేక మంది వీరులు, వీరనారుల సేవలు గుర్తింపు పొందకుండా మరుగునపడటం బాధాకరమన్నారు. 1857లో బ్రిటిష్ సైన్యం ఝాన్సీని ముట్టడించిన సమయంలో రాణి లక్ష్మీబాయి ప్రాణాలను కాపాడేందుకు ఝల్కారీ బాయి రాణి



వేషం ధరించి యుద్ధరంగంలోకి దిగి అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించారని తెలిపారు. ఆమె త్యాగం భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాల్సినదేనని పేర్కొన్నారు.

నిమ్నజాతికి చెందిన మహిళ కావడమే ఆమె చరిత్ర మరుగున పడటానికి ప్రధాన కారణమని డా. నగేష్ అభిప్రాయపడ్డారు. చరిత్రను సమగ్ర దృష్టితో పునఃపరిశీలించి విస్మరించబడిన వీరుల సేవలను కొత్త తరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బహుజన సమాజంలో ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ఝల్కారీ బాయి వంటి మహనీయుల జీవిత చరిత్రలను విద్యా పాఠ్యాంశాల్లో చేర్చాలని, ఆమె జయంతి, వర్ధంతులను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన ప్రతి వీరుడు, వీరనారికి సమాన గౌరవం లభించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని డా. మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముడిమడుగుల మల్లన్న, సమతా సైనిక దళ్ నాయకులు దుర్గం వెంకట నరసయ్య, గన్న మహేష్, బెక్కం నిఖిల్ సాయి, హరక్షిత తదితరులు పాల్గొన్నారు

# వెల్జాల్ తెలంగాణ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులు చేరాలి

**ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్యతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు**
**వెల్జాల్ తెలంగాణ పబ్లిక్ పాఠశాల డెవలప్మెంట్ కమిటీ సభ్యులు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మారడంతో గ్రామంలోని విద్యార్థిని , విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల,ప్రధానోపాధ్యాయుడు గ్రామ తెలంగాణ పబ్లిక్ స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు,మాజీ ప్రజాప్రతినిధులు,విద్యాభిమాను లు, అందరూ సమయపాలన పాటించి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. గ్రామంలో పర్యటించి విద్యార్థుల యొక్క తల్లిదండ్రులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో విద్యార్థులు చేరితే



వారి భవిష్యత్తు బంగారం అవుతుందని, ఈ ఆధునిక కాలంలో ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తే, అధిక ఫీజుల ఒత్తిడితో తల్లిదండ్రులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. కాబట్టి,నర్సరీ నుండి, ఇంటర్మీడియట్ వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తమ విద్య అందించడం జరుగుతుందని, కావున గ్రామంలోని తల్లిదండ్రులందరూ వారి పిల్లలను తెలంగాణ పబ్లిక్ స్కూల్లో చేర్పియాలని,తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నసీం సుల్తానా, ఉపాధ్యాయులు , పరమేస్, బాలకృష్ణ, కల్పన, హరికృష్ణ, తెలంగాణ పబ్లిక్ స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు చర్ల వెంకట్ రెడ్డి,అంబాజీ, ఉప సర్పంచ్ అజీజ్,టి.ప్రకాష్, అయిల్ అంజయ్య గౌడ్ ,శ్రీశైలం, కల్వకోల్ యాదగిరి ,విజయ్,వి,రాజు, పులిజాల విష్ణు, గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు మెరుగైన విద్య

**పాఠశాలను సందర్శించిన, ప్రాంతీయ విద్యా సంచాలకులు సోమిరెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర ఈడబ్ల్యూఐడీసీ క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్ రెడ్డి, జిల్లాస్థాయి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి హైదరాబాద్ ప్రాంతీయ విద్యా సంచాలకులు ఆర్జేడీ యం. సోమిరెడ్డి సందర్శించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్గా ఎంపికైన ఈ జిల్లా పరిషత్ ఉన్నత, పాఠశాలలో ఉన్న భౌతిక వసతులు, ప్రస్తుతం ఉన్న తరగతి గదుల పరిస్థితి, విద్యార్థుల సంఖ్య, భవిష్యత్ అవసరాలు, నిర్మాణ విస్తరణ అవకాశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పాఠశాలలో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నిరంతర విద్యా విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఇంగ్లీష్ మీడియం బోధన అందించడంతో పాటు డిజిటల్ క్లాస్రూమ్స్, స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్లు, సైన్స్ ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చెయ్యనున్నారు. అలాగే క్రీడా మైదానాలు, ఇండోర్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదికలు, పోషకాహార భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, ఆధునిక మరుగుదొడ్లు, వైద్య సేవలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన



విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు , తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా గ్రామీణ విద్యార్థులకు నగర స్థాయి విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వెల్దండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ వెల్దండ, వెల్దండ మోడల్ స్కూల్ లో అందుబాటులో ఉన్న సుమారు 14 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించి, భవిష్యత్లో నిర్మించాల్సిన అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, పరిపాలనా భవనాలు, వసతి గృహాలు, భోజనశాలలు, క్రీడా మైదానాల ఏర్పాటుకు సంబంధించిన అవకాశాలపై సమగ్ర అధ్యయనం నిర్వహించారు.

డ్రోన్ సాంకేతికత సహాయంతో పాఠశాల ప్రాంగణాన్ని చిత్రీకరించి, భవిష్యత్ అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర నివేదికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఈడబ్ల్యూఐడీసీ రామచంద్రరావు, సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, ఎంఈఓ చంద్రుడు నాయక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలం పెద్దూర్ తండా గ్రామపంచాయతీలో మూడవత్ కిషన్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. దేవుని పడకల్ మాజీ ఎంపీటీసీ మూడవత్ రఘు నాయక్ ద్వారా విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 3000 మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవుని పడకల్ పెద్దూర్ మాజీ ఎంపీటీసీ మూడవత్ రఘు నాయక్ మరియు పడకల్ మాజీ సర్పంచ్ మూడవత్ శంకర్ నాయక్, ఉప సర్పంచ్ మూడవత్ భాస్కర్ మాజీ సర్పంచ్ మూడవత్ సక్రి కిషన్ వార్డు సభ్యులు మూడవత్ శోభ శ్రీను మూడవత్ శ్రీను మూడవత్ రుకి బాషా మూడవత్ గోగ్లీ కిష్ట మూడవత్ సక్రి కిషన్ గ్రామ పెద్దలు మాజీ వార్డ్ మెంబెర్ పుల్యా నాయక్ పోమ్య నాయక్, చందు నాయక్, చందర్ నాయక్ భీమా నాయక్, దరియా నాయక్, నర్య నాయక్ తదితరులు పాల్గొనడం జరిగింది.



## బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్ కి వినతి పత్రం అందజేత



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్ట నుండి మార్చాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని కల్వకుర్తి బస్సు డిపో మేనేజర్ కి మార్చాల సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది అని ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎల్లికట్ట గ్రామం నుండి మార్చాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని సమయానికి బస్సులేక విద్యార్థులు చదువు పట్ల వెనకబడి పోతున్నారు కావున సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, నరసింహ, నారాయణ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో రైతులకు 7 రకాల విత్తనాల పంపిణీ




**అందజేసిన సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండల కేంద్రంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు తలకొండపల్లి సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విత్తన మేళా కార్యక్రమాన్ని తలకొండపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో తలకొండపల్లి సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు అందిస్తున్న ఏడు రకాల ధ్రువీకరించిన సర్టిఫైడ్ విత్తనాలను పంపిణీ చేశారు. నాణ్యమైన విత్తనాల వినియోగంతో రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా మరింత బలోపితం కావాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు,నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణానికి చేయూత




అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన జూలపల్లి మాధవి ఇంటి నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇండ్ల పూర్తి ఇంటి నిర్మాణానికి సిమెంట్ ఇప్పించడం జరిగింది ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్, నాయకులు జంగయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు

## డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన కల్పించిన సీఐ భీమ్ కుమార్



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కల్వకుర్తి పోలీసు పరిధిలో వారం రోజుల పాటు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిఐ భీమ్ కుమార్ తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం లక్ష్యంగా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక సదస్సులు, చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కల్వకుర్తి పట్టణంలోని బిసి వెల్ఫర్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించిన కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్ ఈ సందర్భంగా సిఐ భీమ్ కుమార్ మాట్లాడుతూ, క్షణిక ఆనందం కోసం డ్రగ్స్కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని, విద్య, కుటుంబం, వ్యక్తిత్వ వికాసంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు, మాదకద్రవ్యాల విక్రయాలు లేదా రవాణాపై సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యాభ్యాసం, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని, డ్రగ్స్ వ్యవహారాల్లో పాల్గొనే వారిపై చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో , ఎస్ఐ కురుమూర్తి,కళాశాల ప్రిన్సిపాల్ ,తది తరులు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయ పనులు ప్రారంభించిన సర్పంచ్ అనిత మల్లేష్



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలంలోని దేవుని పడకలు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ గుడి పనులను సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,బోనాల పండుగ వరకు పూర్తి నిర్మాణం జరగాలని దేవాలయ నిర్మాణానికి ఎంతో మంది దాతలు సహాయ సహకారాలు అందించడం జరిగింది అని వారు చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మాధురి, మహేష్, కానుగుల మాధవి, మల్లేష్, గ్రామస్తులు రాజు, కానుగుల మల్లేష్, కడమోని నరసింహ, మహేష్ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదు

కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు
కాయితి విజయ్ కుమార్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

బీఆర్ఎస్ నేత హరీష్ రావు రైతు భరోసా, పంటల కొనుగోలు, రుణమాఫీ తదితర అంశాలపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాము. రైతుల గురించి మాట్లాడే ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతులకు చేసిన అన్యాయం, నెరవేర్చని హామీల గురించి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము. అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రైతు భరోసాపై హరీష్ రావు చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవి,కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది,రైతు భరోసా, రుణమాఫీ, పంటల కొనుగోలు వంటి అంశాల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోంది పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నదాతలను మోసం చేసి, అప్పులపాలు చేసిందే కేసీఆర్ కుటుంబం,కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ రుణమాఫీని అమలు చేసింది,మాది రైతు పక్షపాత ప్రభుత్వమని ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నాము,ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించేలా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఈసారి రాష్ట్రంలో 1.40 కోట్ల మెట్రిక్ టన్నుల రికార్డు స్థాయి పంట దిగుబడి వచ్చింది. అందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 51 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి, మిగిలిన 24 లక్షల మెట్రిక్ టన్నులు కూడా త్వరలోనే కొనుగోలు చేయనుంది, రెండున్నరేళ్లలో రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.1.53 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదే. వరి రైతుల ఖాతాల్లోనే రూ.45 వేల కోట్లకు పైగా జమ చేశాం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని, రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు, రైతు భరోసా, రుణమాఫీ, పంట నష్ట పరిహారం వంటి పథకాలతో రైతులకు అండగా నిలుస్తోంది ,అసత్య ప్రచారాలతో రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకుని, ప్రజల తీర్పును గౌరవించాలని బీఆర్ఎస్ నాయకులను కోరుతున్నాము.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజ్,తాలూకా కార్యదర్శి జంగయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు



# సన్న వరి విత్తనాలు పంపిణి

**అగ్నిధారన్యూస్ సుల్తానాబాద్**

సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామంలోని రైతు వేదికలో వానకాలం సీజన్ సందర్భంగా విత్తన, రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాల సబ్సిడీపై రైతులకు విత్తనాలను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రారంభించి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని, సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం, క్వింటాల్ సన్న వడ్లకు ?500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించారు. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ?1,750 కోట్ల బోనస్ నిధులు కేటాయించగా,పెద్దపల్లి నియోజకవర్గానికి ?88 కోట్ల 40 లక్షల బోనస్ రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు.సుల్తానాబాద్ మండలానికి ?16 కోట్ల 12 లక్షలు, కాట్నపల్లి గ్రామానికి ?62.91 లక్షలు, నర్సయ్యపల్లికి ?25.75 లక్షలు, బొంతకుంటపల్లి రైతులకు ?33.15 లక్షల బోనస్ అందిందని వివరించారు.గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ రైతులను మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు రకాల మేలైన పంట రకాలను ఎంపిక చేసి రైతులకు మేలు చేస్తుంటే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వడ్లు, మక్కలు, కందులు వంటి ఏ పంటను సక్రమంగా కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ లలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు అక్కడి మొక్కజొన్నలను ఇక్కడ దొంగతనంగా అమ్ముకుంటుంటే స్థానిక బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం మద్దతు ఇవ్వకపోయినా, రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా ?2,400 మద్దతు ధరతో 15 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను కొనుగోలు చేసిందని గుర్తుచేశారు.అంతర్జాతీయ మార్కెట్ మరియు ఎగుమతి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ నిపుణుల సబ్ కమిటీ సూచించిన సాంబ మసూరి (ద్రూ), తెలంగాణ సోన, హెచ్ఎంటి (ఎమీ) సోన, జై శ్రీరామ్, కూనారం సన్నలు (1638), వరంగల్ 4444 (సిద్ధి), ఖచీవీ 7715 అనే ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే రైతులు సాగు చేయాలని, వీటికి ప్రభుత్వం పూర్తి బోనస్ అందిస్తుందని స్పష్టం చేశారు. అలాగే రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రీయ ఎరువులను వాడాలని రైతులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, గ్రామ సర్పంచ్, వ్యవసాయ అధికారులు, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూముల సర్వే వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, వెన్నంపల్లి గ్రామ ప్రభుత్వ భూముల సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశం. నరేగా పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలి.**

**కాల్వ శ్రీరాంపూర్, ముత్తారం మండలాల్లో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**

**సమీక్ష సమావేశంలో అధికారులకు పలు కీలక ఆదేశాలు.**

**కాల్వ శ్రీరాంపూర్, జూన్-23**

గతంలో ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాల భూముల సర్వే వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.

కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సందర్శించి ఎంపీడీవో, తహసీల్దార్ తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ వెన్నంపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూముల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలకు ఇదివరకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాలకు పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని తెలిపారు. పెద్దంపేట గ్రామంలో గోదాం నిర్మాణం కోసం గుర్తించిన 10 ఎకరాల భూమికి సంబంధించిన ప్రక్రియను త్వరగా పూర్తి చేసి భూమిని ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు.మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవోకు సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) కింద మంజూరైన సీసీ రోడ్ల పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని, అందుబాటులో ఉన్న నరేగా నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్లు, నరేగా పనులకు సంబంధించిన బిల్లులు త్వరలోనే విడుదల కానున్న నేపథ్యంలో పనులను వేగవంతం చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ముత్తారం మండలంలోని ఓడేడు శివారులోని వెంకటేశ్వర్లపల్లి గ్రామ పరిధిలో సీలింగ్ భూములను పరిశీలించారు. భూముల స్థితిగతులను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఇందులో కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్ డా.రాముడు ,ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, కాల్వ శ్రీరాంపూర్ ఇంచార్జ్ ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ మహమ్మారిపై ఎక్సైజ్ శాఖ అవగాహన




**మాదకద్రవ్యాల ముప్పుపై విద్యార్థులకు అవగాహన**
**యువత భవిష్యత్తును కాపాడేందుకే ప్రత్యేక కార్యక్రమాలు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం జూన్ 26 సందర్భంగా కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వారం రోజుల పాటు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ సిఐ వెంకట్ రెడ్డి తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం లక్ష్యంగా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక సదస్సులు, చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా రానగర్ బీసీ బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక నష్టాలతో పాటు చట్టపరమైన పరిణామాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ క్షణిక ఆనందం కోసం డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని, విద్య, కుటుంబం, వ్యక్తిత్వ వికాసంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు, మాదకద్రవ్యాల విక్రయాలు లేదా రవాణాపై సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యాభ్యాసం, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని, డ్రగ్స్ వ్యవహారాల్లో పాల్గొనే వారిపై చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంబాజీ, అధ్యాపక బృందం, ఎక్సైజ్ సిబ్బంది సిద్ధార్థ , చంద్రశేఖర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్-2026 జాబితాలో మీ పేరు ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారం తప్పకుండా నింపాల్సిందే..

**హైద్రాబాద్ :** సర్-2026 (ప్రత్యేక సమగ్రసవరణ(సర్)జాబితాలో మీ పేరు ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారం తప్పకుండా నింపాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఏళ్లుగా ఓటేస్తున్నామంటే అలా కుదరదని స్పష్టం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా చేపట్టే ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమంలో భాగంగా ఇలా చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి(డీఈవో), జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఈ నెల 25 నుంచి హైదరబాద్ మహానగరంలో ఓటరు పత్రాల పంపిణీ మొదలవుతుందని, జులై 24న ముగుస్తుందని తెలిపారు. నెలరోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలు నింపినవారి వివరాలతో మాత్రమే ముసాయిదా ఓటరు జాబితా తయారవుతుంది. ముసాయిదాలోని ఓట్లపై నెల రోజుల పాటు ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరిస్తామన్న ఆయన ఆయా ఓటర్లకు నోటీసులు ఇస్తామని చెప్పారు. ఓటరు తగు పత్రాలను అందజేస్తే పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు.

**గుర్తింపు కార్డుల అవసరం లేదు**

అక్టోబరు 1, 2026న తుది ఓటరుజాబితా ముద్రిస్తామని, ముసాయిదా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను కూడా ప్రకటిస్తామన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ ఇంటికి వచ్చిన సమయానికి తాళం వేసి ఉంటే తలుపు, కిటికీల నుంచి పత్రాలను లోపలికి వేస్తారని పేర్కొన్నారు. వాటిలో వివరాలు నింపి సిద్ధంగా ఉంచుకోవాలన్న ఆయన మరో రోజు బీఎల్వో వచ్చి పత్రాలను తీసుకుంటారని పేర్కొన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలతో ఎలాంటి గుర్తింపు కార్డులను ఇవ్వాల్సిన అవసరం లేదు.

**జాబితాలో పేరు లేకుంటే?**

ఎన్యుమరేషన్ పత్రాన్ని అధికారులు ఇవ్వరు. వారు ఓటరుగా నమోదయ్యేందుకు ఎప్పటిలాగే ఫారం-6 నింపాల్సి ఉంటుంది. వారికి సర్-2026 సర్వేతో ఎటువంటి సంబంధం ఉండదు. ఇటీవల ఎన్నికల్లో ఓటు వేసిన నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి ఇల్లు మారిన ఓటర్లకు కూడా ఎన్యుమరేషన్ పత్రం ఇచ్చేది ఉండదు. ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డులోని అడ్రస్?లోనే సదరు వ్యక్తులు ఎన్యుమరేషన్ ఫారం అందుకోవాలి. ఆ చిరునామాతోనే వివరాలను నింపి ఇవ్వాలి. హైదరాబాద్ నగరంలో వివిధ రాష్ట్రాల ఓటర్లను దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు ఇంగ్లీష్?లో ముద్రించిన ఎన్యుమరేషన్ పత్రాన్ని పంపిణీ చేస్తున్నారు.

**ఓటరు సంతకం చేయాలి**

ఎన్యుమరేషన్ పత్రంలో నింపిన వివరాలు సరైనవని తెలుపుతూ ఓటరు లేదా ఓటరు కుటుంబ సభ్యులు సంతకం చేయాల్సి ఉంటుంది. జూనియర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందిని బీఎల్వోలుగా నియమించారు.వారు ప్రతి పత్రాన్ని పరిశీలించి అందులోని వివరాలను బీఎల్వో యాప్‌లో నమోదు చేస్తారన్న ఆయన బీఎల్వో అప్‌లోడ్ చేసే వివరాలను సహాయ ఈఆర్వో, ఈఆర్వోలు ఆమోదిస్తారు. వారికి ఏ మాత్రం అనుమానం వచ్చినా సదరు ఓటరుకు నోటీసు వెళ్తుందని. అనుమానాన్ని నివృత్తి చేసుకునేందుకు అవసరమైన పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

## ఏసీబీ చేతిలో అవినీతి తిమింగళం

**హైదరాబాద్ :** తెలంగాణలో అవినీతి తిమింగలాల వేటను యాంటీ కరప్షన్ బ్యూరో మరింత ఉధృతం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే నమ్మదగిన సమాచారంతో నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. మల్లా రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం ఏకకాలంలో మెరుపు దాడులు ప్రారంభించారు. మల్లా రెడ్డి అక్రమాస్తుల గుట్టు రట్టు చేసేందుకు ఏసీబీ ఏకంగా 11 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. హైదరాబాద్‌లోని మాచ బొల్లారంలో ఉన్న ఆయన నివాసంతో పాటు నిజామాబాద్‌లోని ఆయన కార్యాలయం, నివాసాలపై అధికారులు విరుచుకుపడ్డారు. వీటితో పాటు మల్లా రెడ్డికి అత్యంత ఆప్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీలుగా అనుమానిస్తున్న వారి ఇళ్లు, వ్యాపార సంస్థల్లోనూ ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు.తన అధికారిక ఆదాయ వనరులకు మించి మల్లా రెడ్డి భారీగా ఆస్తులను కూడబెట్టారనే బలమైన ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ ఈ కేసు నమోదు చేసింది. ప్రాథమిక దర్యాప్తులో ఆయన పెద్ద ఎత్తున అక్రమ సంపాదనకు పాల్పడినట్లు ఆధారాలు లభించడంతో, కోర్టు అనుమతితో ఈ సర్ప్రైజ్ రైడ్స్ ప్లాన్ చేశారు. సోదాల సందర్భంగా అధికారులు ల్యాండ్ డాక్యుమెంట్లు, బ్యాంక్ పాస్‌బుక్కులు, బంగారు ఆభరణాలు, భారీగా నగదును గుర్తించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ, ల్యాండ్ డాక్యుమెంట్లు, బ్యాంకు లాకర్ల వివరాలు మరియు ఇతర ఆర్థిక లావాదేవీల రికార్డులను ఏసీబీ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. మల్లా రెడ్డి సర్వీస్ కాలంలో సంపాదించిన చట్టబద్ధమైన ఆదాయానికి, ప్రస్తుతం దొరికిన ఆస్తుల విలువకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని లెక్కగట్టే పనిలో అధికారులు నిమగ్నమయ్యారుఒక కీలక జిల్లాకు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అధికారి నివాసాలపై ఈ స్థాయిలో ఏసీబీ దాడులు జరగడం కలకలం రేపుతోంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com